ఆంధ్రజ్యోతి
MAY
Happy Internation Workers Day
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 1 మే 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.155	235	260
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 కనిష్ఠం 24.0


పేట సభలో ఎమ్మెల్యే మందుల సామేలుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

తుంగతుర్తి కాంగ్రెస్‌లో చిచ్చు

- సూర్యాపేట జిల్లా పార్టీ సమావేశంలో రగడ
- ఎమ్మెల్యే వర్గంపై కాంగ్రెస్ పాత నేతల అసమ్మతి
- ఏడాది కాలంగా సాగుతున్న వర్గపోరు
- అధిష్ఠానం కలగజేసుకోకుంటే పరిస్థితి చేజారిపోతుందని కార్యకర్తల ఆందోళన

తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్‌లో వర్గపోరు ముదురుతోంది. మందుల సామేలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక రెండు, మూడు నెలలపాటు కలిసికట్టుగా ఉన్న క్యాడర్‌లో ఆ తర్వాత విభేదాలు మొదలయ్యాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కుమ్ములాటల నేపథ్యంలో పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహే‌ష్‌కుమార్‌గౌడ్‌కు నాయకులు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. తాజాగా, బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేయడం విభేదాలు తారస్థాయికి చేరాయని పార్టీ కార్యకర్తలు పేర్కొంటున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

సూర్యాపేటలో బుధవారం జరిగిన పార్టీ సమావేశానికి పీసీసీ పరిశీలకులుగా ఎమ్మెల్యేలు మురళినాయక్, ఎడ్మబొజ్జు హాజరయ్యారు. ఎమ్మెల్యే సామేలు సమావేశంలోకి రాగానే వారి సమక్షంలోనే అర్వపల్లి మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా ఎంపికచేసి కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశం రసాభాసగా మారే పరిస్థితి నెలకొనడంతో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, తదితర నాయకులు కలగజేసుకొని సమావేశంలో నిరసనలు వద్దని, ఇబ్బందులు, వాదనలను పార్టీకి నివేదించాలని సూచించి విషయం ముదరకుండా నిలువరించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

ఏడాదిగా గ్రూప్‌వార్

తుంగతుర్తి ఎమ్మెల్యేగా మందుల సామేలు ఎన్నికైన మూడు నాలుగు నెలల నుంచే వర్గవిభేదాలు మొదలయ్యాయి. నియోజకవర్గంలోని పాత కాంగ్రెస్ నాయకులకు, సామేలుతో కలిసి కాంగ్రెస్‌లోకి వచ్చిన కొత్త కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలు పొడసూపడంతో నియోజకవర్గవ్యాప్తంగా వర్గపోరు ప్రారంభమైంది. ప్రధానంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్‌యువవికాసం లబ్ధిదారుల ఎంపికలో పాత కాంగ్రెస్ కార్యకర్తలకు అవకాశం దక్కడం లేదని, ఎమ్మెల్యే బీఆర్ఎస్ నుంచి వచ్చిన కార్యకర్తలకు మాత్రమే ఈ పథకాల్లో ప్రాధాన్యమిస్తున్నారని ఆయన్ను వ్యతిరేకిస్తున్న వర్గీయుల ప్రధాన ఆరోపణ. అయితే అలాంటిదేమీ లేదని, పార్టీలో అందరినీ కలుపుకుపోతున్నామని, సీనియర్లను గౌరవిస్తున్నామని సామేలు చెబుతున్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపికలో అర్హులైనవారికే అవకాశం ఇస్తున్నారని, నిబంధనల మేరకే లబ్ధిదారుల ఎంపిక ఉంటుందనేది ఎమ్మెల్యే వర్గీయులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో ప్రతీ మండలంలో బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యమిస్తూ వారు చెప్పిందే అమలయ్యేట్టు అధికారులను ఎమ్మెల్యే పురమాయిస్తున్నారని, ఇటీవల చేపట్టిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులను సైతం బీఆర్ఎస్ నుంచి వచ్చిన, తనకు అనుకూలమైన వ్యక్తికే పనుల బాధ్యత అప్పగించారని ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సామేలు తీవ్రస్థాయిలో విమర్శించిన బీఆర్ఎస్ నాయకుడినే ఇప్పుడు చేరదీసి, ఆయన కనుసన్నల్లో మండలాన్ని నడపాలని చూస్తున్నారని, మరో రెండు మండలాలకు చెందిన కీలక నాయకులిద్దరు ఇప్పటికీ బీఆర్ఎస్ నేతలతో టచ్‌లో

అధిష్ఠానానికి ఫిర్యాదులు

తుంగతుర్తి నియోజకవర్గంలో పార్టీ రెండు వర్గాలుగా విడిపోయిన విషయం ఇప్పటికే అధిష్ఠానం దృష్టిలో ఉంది. గతంలో ఇలాగే అసమ్మతి కార్యక్రమాలు జరిగినప్పుడు పీసీసీ అధ్యక్షుడు మహే‌ష్‌కుమార్‌గౌడ్‌కు, తాజాగా పీసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నాయి. నియోజకవర్గంలో సమన్వయ కమిటీని నియమించి, అసమ్మతి లేకుండా చేస్తామని పీసీసీ అధ్యక్షుడు హామీ ఇచ్చినా ఇంతవరకు కమిటీ నియమించలేదు. తాజాగా మళ్లీ గలాటా జరగడంతో ఇకనైనా పార్టీ అధిష్ఠానం దృష్టి సారించి అసమ్మతిని సద్దుమణిచే చర్యలు చేపట్టాలని సీనియర్ నాయకులు విన్నవిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తినాల్సి వస్తుందని, పైగా పార్టీ పట్టుకోల్పోతుందన్న విషయాన్ని అధిష్ఠానం గ్రహించాలని సూచిస్తున్నారు.

మిగతా 6వ పేజీలో...



10లో 11వ స్థానం

- 96.88శాతం ఉత్తీర్ణత నమోదు
- సత్తాచాటిన బాలికలు
- 97.38శాతం ఉత్తీర్ణత
- 264 పాఠశాలల్లో 100శాతం ఫలితాలు
- యాదాద్రి జిల్లాకు ఏడో స్థానం
- 14వ స్థానంలో సూర్యాపేట

నల్లగొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరిగిన పదో తరగతి పరీక్ష ఫలితాలను ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. జిల్లాలో మొత్తం 18,636మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 18,054 మంది (96.88శాతం) ఉత్తీర్ణత సాధించారు. యాదాద్రి జిల్లాలో మొత్తం 8,622మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 8,432మంది (97.80శాతం) ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రస్థాయిలో యాదాద్రి జిల్లా ఏడో స్థానంలో నిలిచింది. సూర్యాపేట జిల్లాలో 11,887మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 11,508 మంది (96.81 శాతం) ఉత్తీర్ణత సాధించారు. పేట జిల్లా రాష్ట్ర స్థాయిలో 14వ స్థానంలో నిలిచింది.

జిల్లాలో మొత్తం బాలురు 9,586మంది పరీక్షలు రాయగా, 9,241మంది (96.40శాతం) ఉత్తీర్ణులు కాగా, బాలికలు 9,050మంది పరీక్షలు రాయగా, 8,813మంది (97.38శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఈసారి 264 పాఠశాలల్లో నూటికి నూరు శాతం ఫలితాలు వచ్చాయి. రీకౌంటింగ్ కోసం వచ్చే నెల 15వ తేదీ వరకు ఒక్కో సబ్జెక్టు రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా మే 16వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని, అపరాధ రుసుముతో ప్రతీ పరీక్షకు రెండు రోజుల ముందు వరకు విద్యార్థులు ఫీజును చెల్లించవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు. అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరగనున్నాయి.

264 పాఠశాలల్లో నూరు శాతం ఫలితాలు

జిల్లాలోని 264 పాఠశాలల్లో నూరు శాతం ఫలితాలు వచ్చాయి. జడ్పీ పరిధిలోని 108 ప్రభుత్వ పాఠశాలలు, 106 ప్రైవేట్ పాఠశాలల్లో నూరు శాతం ఫలితాలు వచ్చాయి. ఒక ఎయిడెడ్ పాఠశాల, ఒక ఆశ్రమ పాఠశాల, 7 బీసీ వెల్ఫేర్ పాఠశాలలు, 6 ప్రభుత్వ, 13 కేజీబీవీ, 7 మోడల్ స్కూళ్లు, 4 మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, 7 సాంఘిక సంక్షేమ పాఠశాలలు, 4 ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో నూరు శాతం ఫలితాలు వచ్చాయి.

జిల్లా విద్యాశాఖ 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహించడంతో పాటు విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఉత్తీర్ణత శాతం మెరుగుపడింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు మెరుగుపడ్డాయి. జడ్పీ పరిధిలోని 108 పాఠశాలల్లో 100శాతం ఫలితాలు రావడం గమనార్హం. అదేవిధంగా కేజీబీవీలు, బీసీ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ, మైనార్టీ రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లలో కూడా ఆశించిన ఫలితాలు వచ్చాయి.

ఉమ్మడి జిల్లాలో ఫలితాలు ఇలా..

జిల్లా	హాజరు	ఉత్తీర్ణత	శాతం
నల్లగొండ	18,636	18,054	96.88
సూర్యాపేట	11,887	11,508	96.81
యాదాద్రి	8,622	8,432	97.80

ఏఎమ్మార్పీ హైలెవల్ కెనాల్‌కు రూ.442కోట్లు

- పట్టుబట్టి నిధులు సాధించిన మంత్రి వెంకట్‌రెడ్డి
- జీవో 80 ద్వారా పరిపాలనా అనుమతులు



నల్లగొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఎస్ఎల్‌బీసీ-ఏఎమ్మార్పీ హైలెవల్ కెనాల్ సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టుబట్టి ఈ పనులకు నిధులు సాధించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏఎమ్మార్పీ హైలెవల్ కెనాల్‌కు సీసీ చేయిస్తానని, అందుకు ఎన్ని నిధులైనా మంజూరు చేయిస్తానని వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నల్లగొండ జిల్లా పర్యటనలో, తాజాగా మంగళవారం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఈ పథకానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి వెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం రూ.442కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరుచేస్తూ నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జా జీవో 80ని విడుదల చేశారు. ఏఎమ్మార్పీ హైలెవల్ కెనాల్ 23.500కిలోమీటర్ నుంచి 136.150 కిలోమీటర్ వరకు సుమారు 112.650 కిలోమీటర్ల మేరకు సీసీ లైనింగ్ చేపడతారు. 1983లో ఎస్ఎల్‌బీసీ కింద ఈ కాల్వ నిర్మాణం చేపట్టగా, ఏఎమ్మార్పీ లిఫ్టు ద్వారా ఈ కాల్వను అనుసంధానం చేసి పుట్టంగండి ఎత్తిపోతల నుంచి నీటిని తీసుకునే పథకంగా మార్చారు. దీన్ని 2001లో ప్రారంభించారు.అప్పటి నుంచి ఈ కాల్వకి సీసీ లైనింగ్ చేపట్టాలనే డిమాండ్ ఉంది. కాల్వకు నీటివిడుదల సమయంలో గండ్లుపడడం, కట్టలు బలహీనమవడం వంటి సమస్యలు తరచూ తలెత్తుతున్నాయి. కాల్వ నీటి సామర్థ్యం తగ్గడంతో ఆయకట్టు చివరి భూములకు నీరందని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని రైతులు గత ఎన్నికల సమయంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా, కెనాల్‌కు లైనింగ్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.442కోట్ల నిధులు మంజూరవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీలైనంతవేగంగా టెండర్ల ప్రక్రియ ముగించి పనులు వేగంగా చేపట్టి పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

సీఎం, ఇరిగేషన్ మంత్రికి కృతజ్ఞతలు



2.20లక్షల ఎకరాల ఆయకట్టు, 516 గ్రామాలకు తాగునీరందించే ఎస్ఎల్‌బీసీ-ఏఎమ్మార్పీ హైలెవల్ కెనాల్ పటిష్టత కోసం సీసీ లైనింగ్‌కు ప్రభుత్వం రూ.442కోట్ల నిధులు కేటాయించడం సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు. 42 ఏళ్ల కిందట నిర్మించిన ఈ కాల్వకు లైనింగ్ లేకపోవడంతో ఆయకట్టు చివరివరకు నీరందని పరిస్థితి ఎదుర్కొన్నాం. ఆయకట్టు రైతులకు ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేయించాం. వీలైనంత త్వరగా పనులు చేపట్టి పూర్తి, చేయించి ఆయకట్టు అభివృద్ధికి కృషి చేస్తా.

- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రి

అమరుల పోరాటాలు చరిత్రలో నిలుస్తాయి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

గట్టుప్పల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజల పక్షాన నిలిచిన సీపీఎం కార్యకర్తలు, నాయకుల పోరాటాలు, వారి త్యాగాలు చరిత్రలో నిలుస్తాయని పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. బుధవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో సీపీఎం అమరుల సంస్మరణ సభకు ఆయన హాజరై 136 మంది అమరులైన వారి కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదల పక్షాన నిలబడి ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై నిరంతరం పోరాటాలు నిర్వహించే పార్టీ సీపీఎం అని అన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తూ, దేశ సంపదను తాకట్టు పెడుతోందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అమరుల కుటుంబాలకు చెందిన పలువురు ఈ సందర్భంగా సీపీఎంలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు బండ శ్రీశైలం, కట్ట నరసింహ, కర్నాటి మల్లేశం, చాపల మారయ్య, కర్నాటి సుధాకర్, గోపాల్ రెడ్డి, మాల్గ శ్రీశైలం, పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలి

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ పూర్తి చేయాలని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రబీ ధాన్యం సేకరణను పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ, కొంతమంది మిల్లర్లు హెచ్ఎన్‌పీ, ఆర్ఎన్ఆర్, 1638 ధాన్యం నూకలు ఎక్కువగా అవుతున్నాయనే సాకుతో దిగుమతి చేసుకోవడం లేదని, దీనిపై దృష్టిసారించాలన్నారు. మిల్లర్లు ఎట్టి పరిస్థితుల్లో తరుగు తీయవద్దన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, రబీ ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. జిల్లాలోని మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసుకునేలా ప్రతీ మిల్లుకు 200శాతం కేటాయింపులు చేశామన్నారు. మిల్లుల సామర్థ్యం మేరకు ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకుంటున్నా, వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో ధాన్యం నిల్వ ఉంచేందుకు అవకాశం ఇస్తే బాగుంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హరీష్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నీట్‌కు ఏర్పాట్లు చేయాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్)కు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రవేశ పరీక్ష మే 4 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని, జిల్లాలో 2,048 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్టు తెలిపారు.

అందుకు జిల్లా కేంద్రంలో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎక్కడా తప్పులు జరగకుండా పరీక్షలను నిర్వహించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు నారాయణ్‌అమిత్, రాజ్‌కుమార్, అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ శివరామిరెడ్డి, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్, చింతపల్లి): అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం నల్లగొండ మండలం చందనపల్లి పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. ధాన్యం ఎగుమతికి లారీల సంఖ్య పెంచి, మిల్లులకు వెంటనే తరలించాలని ఆదేశించారు. అదేవిధంగా ఆర్జాలబావి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేసి ధాన్యం రాశులు ఎక్కువగా ఉండటంతో మరో ఐదు లారీలను అదనంగా ఏర్పాటుచేసి 10 రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకాల వర్షాలకు రైతులు నష్టపోకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ హరీష్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నంరాజు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చింతపల్లి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో సుజాత, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

- మక్తల్ ఎమ్మెల్యే, జిల్లా పరిశీలకుడు వాకటి శ్రీహరి ముదిరాజ్
- ఎమ్మెల్సీ శంకర్‌నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న వాకటి శ్రీహరి ముదిరాజ్

నల్లగొండటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని, సంక్షేమ పథకాలు అందుతున్నాయని మక్తల్ ఎమ్మెల్యే, జిల్లా పరిశీలకుడు వాకటి శ్రీహరి ముదిరాజ్ అన్నారు జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని సమస్యలను అధిగమిస్తూ పేదల సంక్షేమమే ధ్యేయంగా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుచేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం లభిస్తుందని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికలలో వారికి అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తప్పనిసరిగా న్యాయం జరుగుతుందని అన్నారు. సంయమనం పాటిస్తే త్వరలో వారికి మంచి అవకాశాలు వస్తాయని అన్నారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే వారికి రానున్న ఎన్నికల్లో, ఇతర పదవులలో అవకాశాలు లభిస్తాయని అన్నారు. కార్యక్రమాలు జరిగినప్పుడు ఫొటోలకు ఫోజులు ఇచ్చే నాయకులు అవసరం లేదని, వారి స్థానంలో త్వరలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని అన్నారు. పార్టీ బలోపేతమే ధ్యేయంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మరో పరిశీలకుడు నసీర్ అహ్మద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం జెండా మోసిన కార్యకర్తలకు తప్పకుండా న్యాయం జరుగుతుందని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మునిసిపల్ మాజీచైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు జూకూరి రమేష్, అంకతి సత్యం, గోపగాని మాధవి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం పాయింట్
Crime point

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం

నల్లగొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం నల్లగొండ జిల్లాకేంద్రంలో జరిగింది. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ ఎర్ర సైదులు తెలిపిన వివరాల ప్రకారం నార్కట్‌పల్లి మండలం బెండల్‌పహాడ్ గ్రామానికి చెందిన జిల్లా యాదగిరి(45) 2020 సంవత్సరం నుంచి నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో నివాసముంటున్నాడు. వృత్తిపరంగా బిల్డర్ అయిన యాదగిరి వ్యాపారంలో నష్టాలు రావడంతో మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఉదయం తెల్లవారుజామున వాకింగ్‌కు అని చెప్పి బయటకు వెళ్లాడు. గ్రీన్‌హిల్స్ కాలనీలో ఓ చెట్టుకు ఉరివేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు, స్థానికులకు సమాచారం అందించారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి కూలీలకు గాయాలు

ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనుల వద్ద ఆరుగురుకి కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం తిమ్మాపురంలో జరిగింది. కూలీలు తెలిపిన వివరాల ప్రకారం ఉపాధిహామీ పథకంలో చెట్లు తొలగించే పనులకు గ్రామానికి చెందిన కూలీలు వెళ్లారు. ముళ్ల చెట్లు తొలగిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనున్న మరో పెద్ద ముళ్ల చెట్టు ఒక్కసారిగా కూలీలు బట్టు గంగమ్మ, బట్టు రేఖ, కొసన మమత, తుమ్మల రాణి, కొసన కౌసల్య, కౌకుంట్ల కృష్ణారెడ్డిలపై కూలింది. దీంతో చెట్టు ముళ్లపొదల కింద కూలీలు చిక్కుకుపోయారు. కూలీలు ఒక్కసారిగా కేకలు వేయడంతో పక్కనున్న కూలీలందరూ వారిని బయటకుతీశారు. ఈ ప్రమాదంలో బట్టు గంగమ్మ, కొసన మమతలకు తీవ్రంగా గాయాలు కాగా, బట్టు రేఖ, తుమ్మల రాణి, కొసన కౌసల్య, కౌకుంట్ల క్రిష్ణారెడ్డిలు స్వల్పంగా గాయపడ్డారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

బాలిక అనుమానాస్పద మృతి

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండకింద ఉన్న పుష్కరిణి చెంత బుధవారం గుర్తుతెలియని బాలిక మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలిక వయసు సుమారు 10 నుంచి 12 ఏళ్లు ఉంటుందని, కల్యాణకట్ట వద్ద విధులు నిర్వహిస్తున్న (శానిటేషన్ విభాగానికి చెందిన) గొల్లెపల్లి సాయికుమార్ ఉదయం 9.30 గంటలకు అందించిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికపై యువకుడి అత్యాచారయత్నం

గరిడేపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి):సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో పదేళ్ల బాలికపై ఓ యువకుడు అత్యాచారయత్నం చేశాడు. ఎస్ఐ చలిగంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామంలో మంగళవారం రాత్రి ఏడు గంటల సమయంలో పదేళ్ల బాలిక తన అమ్మమ్మ ఇంటి ఎదుట తోటి పిల్లలతో ఆడుకుంటున్న సమయంలో కరెంట్‌పోయింది. అదే సమయంలో గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ అమరారపు సాయి అక్కడికి వెళ్లి బాలిక నోరు మూసి ఇంట్లోకి ఎత్తుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. చిన్నారి కేకలు వేయడంతో అక్కడే వదిలేశాడు. అర్ధరాత్రి సమయంలో మరోమారు బాలిక ఇంటికి వెళ్లి అత్యాచారయత్నం చేయడంతో బాలిక కుటుంబసభ్యులు మేల్కొవడంతో ఆ యువకుడు పరారయ్యాడు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించామని, రిపోర్టు రావాల్సి ఉందని ఎస్ఐ నరేష్ తెలిపారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆశలు శిథిలమై..



రోదిస్తున్న సందీప్ తల్లి, భార్య నిఖిత



రాస్తారోకో చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

కష్టంతో నెట్టుకొస్తున్న కుటుంబాలను నెట్టుకొస్తున్న యువకులు వారు. భవిష్యత్‌పై భరోసాతో పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కలోగంజో తాగుతూ తల్లిదండ్రులు, భార్యాపిల్లలతో కుటుంబాలతో గడుపుతున్నారు. వారి ఆనందాలను పేలుడు ఘటన ఛిద్రం చేసింది. చేదోడువాదోడుగా నిలుస్తున్న కుమారులను ప్రమాదం పొట్టన పెట్టుకుంది. మంగళవారం సాయంత్రం యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతి చెందాడు.

మోటకొండూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉన్నదాంట్లో ఆనందంగా గడుపుతున్న కుటుంబాల్లో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. భవిష్యత్‌పై అల్లుకున్న ఆశలను ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పేలుడు ఘటన పేకముక్కల్లా కూల్చేసింది. చనిపోయిన వారిని తలుచుకుని రోదిస్తున్న తీరు కన్నీరుపెట్టిస్తోంది. కడుపుతో ఉన్న భార్య, నాన్నెప్పుడు వస్తాడని ఎదురుచూస్తున్న రెండేళ్ల కుమారుడు, భర్తను కోల్పోయి అన్నీ కుమారుడిలోనే చూసుకుంటున్న తల్లికి ఇక వారు రారూ అన్న సంగతి జీర్ణించుకోలేని పరిస్థితి. ఉపాధి చూపిన కంపెనీతో ఉసురుతీసిందని కన్నీరుమున్నీరయ్యారు. అశ్రునయనాల మధ్య వారి అంత్యక్రియలు బుధవారం పూర్తయ్యాయి.

మూడుకు చేరిన మృతులు

మోటకొండూరు మండలం కాటేపల్లిలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్‌లో పేలుడులో ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. 18-ఏ బిల్డింగ్‌లో శ్రీహరికోటలో చేసే రాకెట్‌లాంచ్‌లో ఉపయోగించే ప్రొపలెంట్‌ను తయారుచేస్తుండగా మంగళవారం సాయంత్రం భారీపేలుడు జరిగింది. ఆ సమయంలో తొమ్మిదిమంది పనులు చేస్తుండగా కూలిన భవనం కింద ఇద్దరు కార్మికులు చిక్కుకోగా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో భువనగిరిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నరేష్ అనే కార్మికుడు మృతి చెందాడు. మిగతా వారికి చికిత్స అందిస్తున్నారు. శిథిలాల్లో చిక్కుకున్న చందోజు దేవిచరణ్(22), మండలంలోని కాటేపల్లికి చెందిన గునుగుంట్ల సందీప్(30)లను బుధవారం వేకువజామున ఫైర్, పోలీస్ సిబ్బంది సహాయంతో వెలికితీయగా వారు అప్పటికే మృతి చెందారు. మృతదేహాలకు భువనగిరిఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం స్వగ్రామాలకు తరలించి, గ్రామస్థులు భారీగా తరలిరాగా అంత్యక్రియలు పూర్తిచేశారు.

నాలుగు గంటల పాటు రాస్తారోకో

ప్రీమియర్ కంపెనీలో పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఉదయం తొమ్మిది గంటల నుంచి ఒంటి గంట వరకు రాయగిరి-మోత్కూరు ప్రధాన రహదారిపై సుమారు నాలుగు గంటలపాటు రాస్తారోకో చేపట్టారు. దీంతో కిలో మీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ కావడంతో పోలీస్‌లు వాహనాలను ఇతర గ్రామాల మీదుగా దారి మళ్లించారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున..

ప్రీమియర్ కంపెనీలో పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి నష్టపరిహారంతో పాటు తక్షణ సహాయంగా రూ.50 లక్షలు కంపెనీ యజమాన్యం ప్రకటించింది. దీంతో పాటు ఇతర ఇన్సూరెన్స్, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, క్షతగాత్రులకు రూ.5లక్షలతో పాటు పూర్తిగా కోలుకునే వరకు వైద్య ఖర్చులు భరిస్తామని అంగీకరించింది. దీంతో రాస్తారోకో చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.



ఒంటరైన తల్లి

మోటకొండూరు మండలకేంద్రానికి చెందిన చందోజు గోవిందమ్మ కుమారుడు దేవిచరణ్(22) మూడేళ్లుగా ప్రీమియర్ కంపెనీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. చిన్నతనం నుంచే తండ్రికి దూరంగా ఉంటున్న తల్లి వద్ద గారాబంగా పెరిగాడు. అతడికి ఏ కష్టం రాకుండా కుట్టుమిషన్ కుడుతూ ఇంటర్ వరకు చదివించింది. తల్లి కష్టాన్ని చూస్తూ ఉండలేక కంపెనీలో చేరి కుటుంబానికి అండగా ఉంటున్నాడు. అతడి మృతితో తల్లి గోవిందమ్మ రోదనలు స్థానికులను కలిచివేశాయి. భర్త దూరమై, కుమారుడు కాటికి చేరడంతో ఆమె ఒంటరిగా మిగిలిపోయింది.

అరణ్య రోదన



పెళ్లయిన ఆరు నెలలకే..

మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన గునుగుంట్ల సందీప్(30)కు చీకటిమామిడి గ్రామానికి చెందిన నిఖితలో ఆరు నెలల క్రితమే వివాహమైంది. 2019 నుంచి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బుధవారం పేలుడులో సందీప్ మృతి చెందాడు. భార్య నిఖిత ప్రస్తుతం గర్భిణి, మరో రెండు రోజుల్లో సీమంతం చేద్దామని నిశ్చయించుకున్నాడు. కానీ అంతలోనే విధి వక్రించింది. తల్లి మంగమ్మ కులీ పనులకు వెళ్తుంది. తండ్రి శ్రీనివాస్ 2021లో గ్రామంలో కొంతభూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు సాగులో నష్టాలు రావడంతో 2021లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాడు తండ్రి, నేడు కుమారుడిని కోల్పోయి తల్లి, భర్తను కోల్పోయి ఇల్లాలు గుండెలవిసేలా సందీప్‌ను గుర్తు చేసుకుని రోదించారు.

రెండేళ్ల కుమారుడు..

ప్రీమియర్ కంపెనీ పేలుళ్లలో ఆత్మకూరు(ఎం) మండలకేంద్రానికి చెందిన కల్వల నరేష్(32) మృతిచెందాడు. అతడికి నాలుగేళ్ల కిందట వలిగొండ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన జయంతితో వివాహమైంది. వీరికి కుమారుడు విశ్వతేజ్(2) ఉన్నాడు. నరేష్ తల్లిదండ్రులు మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వివాహఅనంతరం వేరేకాపురం ఉంటున్నారు. ఉపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం మండలంలోని ప్రీమియర్ కంపెనీలో చేరాడు. పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడగా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రెండేళ్ల కుమారుడితో భార్య రోదనలు అందరినీ కదలించాయి.



రోదిస్తున్న నరేష్ కుటుంబ సభ్యులు

ధనార్జనే ధ్యేయంగా యాజమాన్యం తీరు

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య..

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ యజమానుల ధనార్జనే ధ్యేయంగా, ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టకుండా కార్మికులతో పనులు చేయిస్తున్నారని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మండిపడ్డారు. కంపెనీలో పేలుడు జరిగిన ప్రదేశాన్ని బుధవారం వారు పరిశీలించారు. పేలుడుకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా జాగ్రత్తలు తీసుకోవాలని యాజమాన్యానికి సూచించారు. వారి వెంట ఆలేరు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు యెల్లంల సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగపురం మల్లేష్, కొంతం మోహన్‌రెడ్డి, భూమండ్ల శ్రీనివాస్, గంధమల్ల జహంగీర్ పాల్గొన్నారు.



సంఘటన వివరాలను తెలుసుకుంటున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అయిలయ్య

ఒక్కొక్కరికి రూ.5కోట్లు ఇవ్వాలి: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

ప్రీమియర్ కంపెనిలో పేలుడులో మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5కోట్లు, క్షతగాత్రులకు రూ.2కోట్లు ఇవ్వాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ పొలిటికల్ జేఏసీ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సూదగాని హరిశంకర్ గౌడ్ డిమాండ్ చేశారు. కాటేపల్లిలోని ప్రమాదానికి కారణమైన ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీని వారు బుధవారం పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి, వారితో మాట్లాడారు. ప్రభుత్వం తరుపున న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు.



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మల్లన్న

తుంగతుర్తి కాంగ్రెస్‌లో చిచ్చు

(5వ పేజీ తరువాయి)

ఉన్నారని ఆరోపిస్తున్నారు. అలాంటి వారిని నమ్మి ఎమ్మెల్యే, నియోజకవర్గంలో పాత కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేస్తున్నారని, దీంతో పార్టీ బలహీనపడుతోందని వ్యతిరేకవర్గ నాయకులు విమర్శిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే వర్గీయులు మాత్రం ఇదంతా ఓర్వలేక చేస్తున్నారే తప్ప ఆరోపణల్లో వాస్తవం లేదని, పార్టీలో ఎమ్మెల్యే అందరికీ సమప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు సమాంతరంగా వర్గాన్ని నడపాలని, ప్రభుత్వ వ్యవహారాలను తమ గుప్పిటపట్టాలని చూస్తున్న నాయకులే దీనంతటికీ కారణమని, అసలైన నాయకులు, కార్యకర్తలకు ఎక్కడా ఇబ్బంది లేదని, ఇదంతా కొందరు నేతలు కుట్రతో ప్రోత్సహిస్తుండడం వల్లే అసమ్మతి ఘటనలు జరుగుతున్నాయని సామేలు వర్గీయులు చెబుతున్నారు.

మూగజీవాల సంచారం.. గాలిలో ప్రాణం

వరి కోతలు పూర్తికావడం, వేసవి రావడంతో మేత కోసం గేదెలను యజమానులు వదిలేస్తున్నారు. దీంతో అవి జాతీయ రహదారులపైన డివైడర్ల మధ్యలోని మేతకోసం సంచరిస్తూ ప్రమాదాలకు నిలయంగా మారతున్నాయి.

(ఆంధ్రజ్యోతి-కోదాడ)

సోమవారం సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలోని తమ్మర వద్ద గేదేను ఢీకొని పోస్టల్ ఉద్యోగి మృతి చెందారు. అంతేకాక గత నెల 26 రాత్రి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆకుపాముల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గేదె మృతి చెందింది. మృతి చెందిన గేదే కనిపించక బైక్‌పై వెళ్తున్న అన్నాచెల్లెళ్లు దానిని ఢీకొన్నారు. దీంతో చెల్లెలు మృతి చెందగా, అన్నకు తీవ్రగాయాలయ్యాయి. వేసవి కాలంలో జాతీయ రహదారి వెంట గ్రామస్థులు పశువులను మేత కోసం వదులుతుండటం, అవి మేత కోసం డివైడర్‌ల మధ్య ఉండే గడ్డికోసం హైవేలపైకి వెళ్తున్నాయి. గడ్డి తిని ఒకేసారి రహదారిపై రావటం, వేగంగా వస్తున్న వాహనదారులు వేగాన్ని నియంత్రించలేక ప్రమాదానికి గురికావాల్సి వస్తోంది. మేత కోసం రహదారులకు ఇరువైపులా ఉండే వ్యవసాయ పొలాలకు వెళ్తుంటాయి. రాత్రివేళ గ్రామాల నుంచి ఒక్కసారిగా రహదారులపైకి వస్తుడంటంతో వాహన లైట్ల కాంతికి అవి కనిపించక ప్రమాదాలు జరగటం నిత్యకృత్యమైంది. గేదెలు ఢీకొన్న సంఘటనలలో పదుల సంఖ్యలో వాహనదారులు క్షతగాత్రులయ్యారు. గేదెలను వదలవద్దని పంచాయతీ సిబ్బంది, పోలీసులు, హైవే అధికారులు గ్రామాల్లో డప్పుచాటింపులు చేస్తున్నా, నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారని రహదారి వెంట గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.వారి నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు పోతున్నాయి. అంతేకాకుండా కొన్నిసందర్భాల్లో గేదెల యజమానులు కూడా ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా గేదెలను రహదారులపైకి వదలవద్దని వాహన దారులు సూచిస్తున్నారు.



కోదాడ-ఖమ్మం జాతీయ రహదారిపై సంచరిస్తున్న గేదెలు

అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్, పక్కన డీఎస్పీ రాజశేఖరరాజు, ఇతరులు

నల్లగొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా ఖరీదైన ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.26.50లక్షల విలువైన 14వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బుధవారం తెల్లవారుజామున వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలం కావూరు గ్రామానికి చెందిన నలమాల ఎర్రబ్బాయి, అదేగ్రామానికి చెందిన గుంజి అంకమరావులు ఓ ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని దామరచర్ల, నల్లగొండ పట్టణం, నార్కట్‌పల్లి, ఇబ్రహీంపట్నంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మార్టూరు, పొన్నూరు పట్టణాల్లో రాత్రి సమయంలో ఇంటి ముందు నిలిపిఉంచిన వాహనాలను చోరీచేస్తున్నట్లు వారు అంగీకరించారు. వీరిద్దరితోపాటు పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలంలోని జాన్‌పహాడ్‌కు చెందిన మట్టిపల్లి శ్రీకాంత్ ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.

విలువైన బైక్‌లే లక్ష్యంగా..

నలమాల ఎర్రబ్బాయి, గుంజి అంకమరావు, మట్టిపల్లి శ్రీకాంత్‌లు కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఎర్రబ్బాయి మూడేళ్లుగా నల్లగొండ జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు పట్టణాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, జనసంచారం ఉన్న హోటళ్లు, వైన్స్‌ల వద్ద, రాత్రి పూట ఇంటి ముందు పార్కు చేసి ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్, పల్సర్ మోటార్ సైకిళ్లను చోరీ చేసేవారు. తన వద్ద ఉన్న పాత తాళాలతో దొంగతనాలు చేసి తన స్నేహితులైన మిగతా ఇద్దరు వ్యక్తులతో కలిసి వాటిని తక్కువ ధరకు విక్రయించి వచ్చిన నగదుతో జల్సాలు చేసేవారు. దొంగిలించిన వాహనాన్ని విక్రయించేందుకు బయలుదేరి పోలీసులకు చిక్కారు. ఈ ముగ్గురు నల్లగొండ జిల్లాలో గతంలో 66 ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన కేసుల్లో నిందితులుగా ఉన్నారు. విచారణలో భాగంగా నేరం అంగీకరించటంతో వారినుంచి ఆరు రాయల్ ఎన్‌ఫీల్డ్, ఏడు పల్సర్, ఒక షైన్ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. 14వాహనాల విలువ రూ.26.50లక్షలు ఉంటుందని, నిందితులు చోరీ చేశామని అంగీకరించిన మరో 22 వాహనాలను స్వాధీనం చేసుకుంటామని ఎస్పీ తెలిపారు. వాహనాల చోరీ కేసును ఛేదించిన మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డానియేల్, వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది సతీష్, భాస్కర్, వెంకటేశ్వర్లు, రషీద్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్‌గిరి, రాంప్రసాద్, పుష్పగిరి, శ్రీనివాస్‌రెడ్డిలను ఎస్పీ అభినందించి రివార్డులను ప్రకటించారు.

'పది'లో సిటీ టాలెంట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



సాయి సృజన, ప్రణవి, శ్రీజ, హర్షిత, ప్రజ్ఞారెడ్డి, సుదీపారెడ్డి



సాయిగోకుల్, శిశిర, కశ్యప్‌రామ్, సాయి రిష్విక్, నితీషావర్థిని

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సిటీ టాలెంట్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చారని పాఠశాల కరస్పాండెంట్ ఆర్.ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఎస్.సాయిసృజన 600మార్కులకు గాను 595 మార్కులతో రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు సాధించింది. అదేవిధంగా బీ.ప్రణవి 588, జీ.శ్రీజ 583, పీ.హర్షిత 581, వై.ప్రజ్ఞారెడ్డి 579, ఎస్.సాయిగోకుల్ 577, వై.శిశిర 577, ఎన్.సుదీపారెడ్డి 577, ఐ.కశ్యప్‌రామ్ 575, ఎం.సాయి రిష్విక్ 573, జీ.నితీషావర్థిని 571 మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీధర్, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

ఫలితాల్లో 'జయ' పాఠశాల ప్రభంజనం

సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలకు చెందిన ప్రతి ఐదుగురు విద్యార్థులు 587మార్కులతో అన్ని సబ్జెక్టుల్లో అత్యధికంగా ఏ-1 గ్రేడ్ సాధించారని పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. ప్రతి ఐదుగురు విద్యార్థులు 587 మార్కులతో పాటు అన్ని సబ్జెక్ట్‌లలో అత్యధికంగా ఏ-1 గ్రేడ్ సాధించారని తెలిపారు. పాఠశాల నుంచి 580 మార్కులు 15మంది విద్యార్థులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బింగి జ్యోతి, జెల్లా పద్మ పాల్గొన్నారు.



ఉత్తమ ప్రతిభ కనబర్చిన జయపాఠశాల విద్యార్థులు

నిజమైన పేదలకే సంక్షేమ పథకాలు



మునుగోడు మండలకేంద్రంలో ఆధునికీకరించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వ కాంగ్రెస్ పాలనలో నిజమైన పేదలకు సంక్షేమాభివృద్ధి పథకాలుదక్కాలన్నదే తమ లక్ష్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గకేంద్రంలో ఆధునికీకరించిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ భవనం, అదనపు గదుల నిర్మాణంతో పాటు సమావేశ మందిరాన్ని బుధవారం ఎమ్మెల్యే దంపతులు కలిసి ప్రారంభించారు. ముందుగా పురోహితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికైన క్యాంప్ కార్యాలయం శాశ్వతంగా ఉంటుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో పార్టీలకు కాదని, నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర్హులకే స్థానం ఉంటుందన్నారు. అనంతరం భవనంలో ఇందిరమ్మ గృహాల మంజూరుపై నియోజకవర్గ స్థాయిలో నాయకులతో తొలిసారిగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ జనరల్ సెక్రటరీ పున్న కైలాష్‌నేత, మాజీ అధికార ప్రతినిధి నారబోయిన రవిముదిరాజ్, చండూరు ఏఎంసీ చైర్మన్ దోటి నారాయణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పాల్వాయి చెన్నారెడ్డి, భీమనపల్లి సైదులు నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు కార్యకర్తలు , వివిధశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● మేమంతా ఒక్కటే.. బొడ్రాయి ఉత్సవాలకు ముస్లిం విరాళం



రాజాపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం పాముకుంట మధిర గ్రామమైన కాశగూడెం ముస్లింలు ఆదర్శనంగా నిలుస్తున్నారు. గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠా ఉత్సవాలను నిర్వహిస్తుండగా తాము కూడా ఉత్సవాల్లో భాగస్వాములవుతామని ముందుకువచ్చారు. కాశగూడెంలో 524మంది ముస్లిం జనాభా ఉండగా, వారంతా కలిసి ఉత్సవ నిర్వాహకులకు రూ.23,700లను విరాళం బుధవారం అందజేశారు. పీర్ల పండుగలో హిందువులు, బొడ్రాయి ఉత్సవాల్లో ముస్లింలు భాగస్వాములవడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు.



సూర్యాపేట జిల్లా అర్వపల్లిలో ఈత కొడుతున్న యువకులు





నిర్మానుష్యంగా ఉన్న భువనగిరి- రాయగిరి బైపాస్ రోడ్డు



నల్లగొండలో...

సూర్య ప్రతాపం

భానుడు భగభగ మంటున్నాడు. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఇళ్లలో నుంచి బయటికి వెళ్లాలంటే ప్రజలు జకుతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప బయటికి వెళ్లడం లేదు. వేసవి ఉష్ణోగ్రతలు తట్టుకోలేక చిన్నారులు, యువకులు స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్తున్నారు. వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. గుడారాలు వేసుకొని చిరు వ్యాపారులు పండ్లు, కూరగాయాలు విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి అర్వపల్లి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ, యాదాద్రి



గొడుగు రక్షణగా..



అర్వపల్లిలో జ్యూస్ విక్రయాలు



దాహం తీర్చుకుంటున్న వానరం



యాదగిరిగుట్ట ఆలయం వద్ద..

గుట్ట ఈవోగా వెంకట్రావ్ బాధ్యతల స్వీకరణ



గుట్ట ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట్రావ్

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట ఆలయ కార్యనిర్వాహణ అధికారి (ఈవో)గా ఐఏఎస్ అధికారి ఎస్. వెంకట్రావ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయన గర్భాలయంలో స్వామి అమ్మవారిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. ప్రధాన పూజారులు ఆయనకు ఆశీర్వచనం చేశారు. వెంకట్రావ్ ఉమ్మడి నల్లగొండ జేసీ, యాదాద్రి జిల్లా ఆర్డీడీఏ పీడీగా పనిచేసిన సమయంలో పదోన్నతిపై మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా వెళ్లారు. అక్కడి నుంచి నారాయణపేట, సూర్యాపేట జిల్లాల కలెక్టర్‌గా సేవలందించారు. ప్రస్తుతం ఈవోగా బాధ్యతలు చేపట్టిన వెంకట్రావ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ డైరెక్టర్ జాయింట్ కార్యదర్శిగా పనిచేశారు. గుట్ట ఈవోగా పనిచేసిన ఏ. భాస్కర్‌రావుకు ఉద్యోగులు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, భద్రాచలం ఆలయ ఈవో రమాదేవి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, సివిల్ ఈఈ జిల్లెల దయా కర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఈఈ ఊడెపు వెం కటరామరావు, ప్రధాన అర్చకుడు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, పర్యవేక్షకుడు మాచర్ల రాజన్‌బాబు, దాసోజు నరేష్, వేముల వెంకటేశ్, ముద్దసాని నరేష్, యాస రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మూసీకి నిలకడగా ఇన్‌ఫ్లో

కేతేపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు 25 రోజులుగా ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం 25రోజుల్లో ఆరు అడుగుల మేర పెరిగింది. 645అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు ఈ నెల మొదటి వారంలో సాగునీటి విడుదలను నిలిపివేసే నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 623.50 అడుగులు (0.71టీఎంసీలు) కనిష్ట స్థాయికి పడిపోయింది. ఈ క్రమంలో మూసీ నది ఎగువన గల ధర్మారెడ్డి కాల్వ, పిల్లాయిపల్లి, ఆసిఫ్‌నహార్ కత్వలు, ఇతర ఫీడర్ ఛానళ్లకు మూసీ నది పరీవాహక ప్రాంత గ్రామాలు, హైదరాబాద్‌లో కురుస్తున్న అకాల వర్షాలు, హైదరాబాద్ నగరం నుంచి వచ్చే డ్రైనేజీ, వృథా నీటిని మళ్లించడంతో చిట్యాల, రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాల్లోని పలు చెరువులు, కుంటలు నిండి ప్రస్తుతం అలుగు పోస్తున్నాయి. చెరువులు, కుంటల అలుగుల నుంచి వచ్చే నీరంతా ప్రస్తుతం దిగువన మూసీ ప్రాజెక్టుకు చేరుతుండడంతో ప్రాజెక్టుకు దాదాపు 380క్యూసెక్కుల పైచిలుకు ఇన్‌ఫ్లో నిరంతరాయంగా కొనసాగుతుంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం ఒక్కో పాయింటు చొప్పున పెరుగుతూ వస్తోంది. 630.10అడుగులుగా ఉన్న ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం సాయంత్రానికి మరో అడుగు పెరిగి 631.05అడుగులు(1.54టీఎంసీలు)గా నమోదైంది.

స్వాతంత్ర్య సమరయోధురాలు కన్నమ్మ మృతి



కన్నమ్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ , ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధురాలు, తెలంగాణ సాయుధ పోరాట దళ సభ్యురాలు పశ్య కన్నమ్మ(90) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం తుది శ్వాస విడిచారు. ఆమె భర్త తెలంగాణ సాయుధపోరాట దళ సభ్యుడు పశ్య రామిరెడ్డి గతంలోనే మృతిచెందారు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఆమె తెలంగాణ సాయుధపోరాటంలోనూ దళ సభ్యురాలిగా పనిచేశారు. 1941లో జరిగిన ఆంధ్ర మహాసభలో పాల్గొన్నారు. ఆమె సోదరుడు దళ కమాండర్ దొంతిరెడ్డి శంభిరెడ్డితో కలిసి అనేక ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. కన్నమ్మ కుటుంబంపై రజాకారులు అనేకసార్లు దాడులు చేశారు. రజాకార్ల ఎదురుదాడిలో ఆమె సోదరుడు శంభిరెడ్డి అమరుడయ్యారు. 1971 నుంచి 1980 వరకు హుజూర్‌నగర్ మేజర్ గ్రామపంచాయతీ సభ్యురాలిగా, కోఆప్షన్ సభ్యులుగా పనిచేశారు. సీపీఐ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రతినిధిగా అనేక ఉద్యమాల్లో పనిచేశారు. హుజూర్‌నగర్ ప్రాంతంలో 1970 నుంచి 2010 వరకు సుదీర్ఘ కాలం పాటు మహిళా సమాఖ్య బలోపేతానికి కృషి చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలిగా, రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ మహిళా సమాఖ్య జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా పనిచేశారు. ఆమె కుమారుడు పశ్య శ్రీనివాసరెడ్డి, ఆమె కుటుంబమంతా సీపీఐలోనే ఉండి పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నారు. పశ్య కన్నమ్మ మృతికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, గన్నా చంద్రశేఖర్, యల్లావుల రాములు, బెజవాడ వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు సంతాపం తెలిపారు. ఆమె మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు.

చివరిరోజు గుర్తుండిపోయేలా..

హోంగార్డును సన్మానించి పోలీస్ వాహనంలో సాదరంగా ఇంటికి



హోంగార్డు వెంకన్నపై పూలు చల్లుతున్న సిబ్బంది

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న రంగపురి వెంకన్నకు చివరిరోజు గుర్తుండిపోయేలా వీడ్కోలు పలికారు ఎస్ఐ క్రాంతికుమార్, సిబ్బంది. మంగళవారం రాత్రి సీఐ నాగరాజుతో పాటు స్టేషన్‌లోని అన్ని విభాగాల సిబ్బంది, కుటుంబసభ్యుల సమక్షంలో వెంకన్నను ఘనంగా సన్మానించారు. సిబ్బంది కలిసి సమకూర్చిన రూ.60వేల నగదు ప్రోత్సాహకాన్ని వెంకన్నకు అందజేశారు. పోలీసులు ఆయనపై పూలవర్షం కురిపించి పోలీస్ వాహనంలోనే నల్లగొండలోని అతని ఇంటికి చేర్చారు.

అకాల వర్షం.. రైతుకు నష్టం



సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో తడిసిన ధాన్యం

తిరుమలగిరి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బుధవారం కురిసిన అకాల వర్షం రైతులకు నష్టం మిగిల్చింది. నోటికాడికి వచ్చిన ముద్ద నేలపాలు కావడంతో అన్నదాతలు ఆవేదన చెందారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉన్నా సాయంత్రం నాలుగు గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఈదురుగాలులతో కూడిన వర్షంతో కొనుగోలు కేంద్రాలు, మార్కెట్‌లో ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు



డిండిలో వర్షానికి తడిసిన ధాన్యం ఎత్తుతున్న రైతులు

టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో చాలా మంది రైతుల ధాన్యం తడిసి వరదలో కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని తరగు లేకుండా ప్ర భుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యం

నాగారం: నాగారం మండలంలో బుధవారం కురిసిన అకాల వర్షానికి ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయింది. ధాన్యం ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం పోసి నెలరోజులు దాటినా జిల్లాలో మిల్లుల ఆలాట్‌మెంట్ ఆలస్యం కావడంతో ధాన్యం కొనుగోలు రోజురోజుకు ఆలస్యమతువున్నాయని ఐకేపీ నిర్వాహకులు తెలిపారు. సకాలంలో మిల్లులను సెంటర్లకు అలాట్ చేసి ఉంటే ధాన్యం కోనుగోలు 90శాతానికి పైగా పూర్తియ్యేవని రైతు లు వాపోతున్నారు. అధికారులు స్పందించి త్వరగా మిల్లుకు ధాన్యం తరలించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరతున్నారు.

ఉరుములు.. మెరుపులు

దేవరకొండ: దేవరకొండలో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొన్ని నెలలుగా ఎండవేడిమికి అల్లాడుతున్న పట్టణ ప్రజలు చిరు జల్లులతో కూడిన వర్షం కురవడంతో కొంత ఊరట చెందారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పట్టణం లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతి

డిండి: మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన జబ్బు పెద్దయ్యకు చెందిన రెండు ఎద్దులు పిడుగుపడి బుధవారం మృతి చెందాయి. గ్రామానికి చెందిన జబ్బు పెద్దయ్య తన రెండు ఎడ్లను వ్యవసాయబావి వద్ద చెట్టుకు కట్టేసి ఉంచాడు. సాయంత్రం సమయంలో ఉరుములు, మెరుపులు, ఈదరుగాలులతో కూడిన వర్షానికి పిడుగుపడి రెండు ఎద్దులు మృతిచెందాయి. ఎద్దుల విలువ సుమారు రూ. లక్షకుపైగా ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరాడు.



డిండి : బ్రాహ్మణపల్లిలో పిడుగుపాటుకు మృతిచెందిన ఎడ్లు

సకాలంలో ఎగుమతులు కాక..

డిండి: మండలంలో బుధవారం కురిసిన అకాల వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. డిండి మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో ఆరబోసిన ధాన్యంలోకి వర్షపునీరు చేరి తడిసిపోయింది. టార్పాలిన్లు ధాన్యం వర్షానికి తడవకుండా కాపాడుకోలేకపోయామని రైతులు ఆవేదన చెందారు. లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. ప్రతిరోజూ కేంద్రానికి ఒక లారీ మాత్రమే వస్తుందని రైతులు తెలిపారు. కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు అధికారులు కల్పించలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

శాలిగౌరారంలో భారీ వర్షం

శాలిగౌరారం: మండల కేంద్రంలోతో పాటు పలుగ్రామాల్లో బుధవారం సాయంత్రం భారీ ఈదురు గాలులు మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అయిన ప్రజలకు సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. భారీ ఈదురు గాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



శాలిగౌరారం: వల్లాలలో ఈదురు గాలులకు లేచిపోయిన ఇంటి రేకులు

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టా మూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టి అంకార వెండిజోడు సేవలు, సహ స్రనార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజా నాకు రూ.17,45,185 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావ్ తెలిపారు.

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, మూలవిరాట్‌స్వామికి పంచసూక్త విధానంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవారికి అష్టోత్తర సహస్ర, కుంకుమార్చనలు నిర్వహించారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవారిని వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం నిర్వహించారు. అనంతరం మాంగళ్య ధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. గరుడ వాహనంపై ఆలయ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, తూమాటిశ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు పాల్గొన్నారు.

9 నుంచి నృసింహ జయంత్యుత్సవాలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవాలు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో వెంకట్రావ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానాలయంతో పాటు అనుబంధ ఆలయాలు పాతగుట్ట, దబ్బకుంటపల్లి ఆలయాల్లో స్వామివారి జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రధానాలయం, పాతగుట్ట ఆలయాల్లో ఉదయం, సాయంత్రం కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. బచ్చన్నపేట మండలం దబ్బకుంటపల్లి ఆలయంలో 11న(ఆదివారం) ఉదయం 8.30గంటలకు స్వస్తివాచనం, విష్వక్సేన పూజ, అభిషేకాలు, తిరిగి 10.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, మహా నివేదన, తీర్థప్రసాద వితరణ, ఆశీర్వచనం చేస్తారు. జయంతోత్సవాల సందర్భంగా ప్రధానాలయం, పాతగుట్ట ఆలయాల్లో నిర్వహించే నిత్య, శాశ్వత కల్యాణం, నిత్య, శాశ్వత బ్రహోత్సవాలు, సుదర్శన నారసింహ హోమాలు, జోడు సేవలతో పాటు 11న ఉదయం జరిపించే నిజాభిషేకాలు, సహస్రనామార్చనలు రద్దు చేసినట్లు ఈవో తెలిపారు.

	ఉదయం 8.45గంటలకు	సాయంత్రం 6 గంటలకు
9న	స్వస్తివాచనం, విశ్వక్సేన పూజ పుణ్యాహవచనం, రుత్విక్ వరణం లక్ష కుంకుమార్చన, తిరు వెంకటపలి అలంకార సేవ	మృత్యంగ్రహణం, అంకురార్పణ హవనం, గరుడవాహనం పరవాసుదేవ అలంకార సేవ
10న	నిత్య నృసింహ మూలమంత్ర హవనాలు, లక్ష పుష్పార్చన, కాళీయ మర్దన అలంకార సేవ	నృరసింహ మూలమంత్ర హవనాలు, నిత్య పూర్ణాహుతి, శ్రీరామ అలంకారంలో హనుమంత వాహన సేవ
11న	ఉదయం నృరసింహ మూలమంత్ర హవనాలు, మహాపూర్ణాహుతి తదుపరి సహస్ర కలశాభిషేకం నృరసింహ ఆవిర్భావం, మహానివేదన, తీర్థప్రసాద గోష్టి	సాయంత్రం 7 గంటలకు విశేష తిరువారాధన, అర్చన, వేద స్వస్తి, ఉత్సవ పరిసమాప్తి

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

నల్లగొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు-143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతిసాగర్ అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం జరిగిన సంఘం జిల్లా కార్యనిర్వహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అక్రిడిటేషన్ నిబంధనలు మారిస్తే ఊరుకోబోమన్నారు. జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యోగానంద్, విష్ణువర్ధన్‌రెడ్డి, రమణకుమార్, అవ్వారి భాస్కర్, అన్నెబోయిన మట్టయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మారుతిసాగర్

సత్తాచాటిన సూర్యాపేట జిల్లా గిత్తలు

ఉభయ తెలుగు రాష్ట్రాల పోటీల్లో ప్రథమ స్థానం

మఠంపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లిలోని శుభవార్త దేవాలయ మహోత్సవాలను పురష్కరించుకొని శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్లపందేల పోటీలు మంగళవారం అర్ధరాత్రి ముగిశాయి. హోరాహోరీగా జిరగిన ఫైనల్ పోటీల్లో సూర్యాపేట జిల్లా గిత్తలు ప్రథమ స్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో పల్నాడు, ప్రకాశం గిత్తలు, మూడో, నాలుగో స్థానాల్లో ప్రకాశం జిల్లా గిత్తలు, ఐదో స్థానంలో సూర్యాపేట మేళ్లచెర్వు గిత్తలు, 6వ స్థానంలో గుంటూరు, పల్నాడు, 7వ స్థానంలో కడప, బాపట్ల గిత్తలు, 8వ స్థానంలో గుంటూరు, కడప గిత్తలు నిలిచాయి. పోటీలను తిలకించేందుకు ఉభయ రాష్ట్రాల నుంచి ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



పోటీల్లో పాల్గొన్న గిత్తలు

సీనియర్ విభాగంలో విజేతలు

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ములకలపల్లి సురేష్, సంధ్యకు చెందిన గిత్తలు(ప్రథమ), యండ్లకంటి వెంకటేశ్వర్లు పల్నాడు, ప్రకాశం జిల్లాకు చెందిన తనుష్‌కుమార్‌గౌడ్ గిత్తలు(ద్వితీయ), బి. విజయలక్ష్మనాయుడు ప్రకాశం గిత్తలు(తృతీయ) వీటితో పాటు మరో ఏడు గిత్తలు బహుమతులు గెలుచుకున్నాయని యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి తెలిపారు. విజేతలకు నగదు, షీల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆధూరి స్రవంతికిషోర్‌రెడ్డి, పాదర్ మార్టిన్ పసల, బ్రదర్ వినోద్‌రెడ్డి, మధుసుధన్‌రెడ్డి, శౌరెడ్డి, జడ్డుజల బాల్‌రెడ్డి, కె. చిన్నపురెడ్డి, భాస్క రొరెడ్డి, బాలశౌరైడ్డి, గాదె పవన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

గోపలాయపల్లిపై వైభవంగా సుదర్శన హోమం

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో బుధవారం సుదర్శన హోమాన్ని నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రమైన రోహిణి తిథి ఉన్న రోజున విశ్వశాంతి కాంక్షిస్తూ ప్రతీనెలా సుదర్శన హోమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ హోమ క్రతువు వద్ద పలువురు దంపతులు కూర్చున్నారు. అనంతరం భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది.

బీసీ కులగణనకు కేబినెట్ ఆమోదంపై హర్షం

మునుగోడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీసీ కులగణన నిర్వహణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై బీసీ విద్యార్థి, యువజన సంక్షేమ సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షులు బూడిద మల్లికార్జున్‌యాదవ్, విజయ్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఢిల్లీలో చేపట్టిన ఆందోళన ఫలితంగా కేంద్రం నిర్ణయం తీసుకోవటం సంతోషకరమన్నారు.

సమానత్వాన్ని ప్రబోధించిన బసవేశ్వరుడు

● ఘనంగా బసవేశ్వరుడి జయంతి వేడుకలు

నల్లగొండ టౌన్, శాలిగౌరారం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కుల వ్యవస్థను వ్యతిరేకించి, సమానత్వాన్ని ప్రబోధించిన అభ్యుదయవాది మహాత్మా బసవేశ్వరుడని పలువురు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో బుధవారం మహాత్మా బసవేశ్వరుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీసీ అభివృద్ధి అధికారి ఖాజానాజిమ్‌అలీ అఫ్సర్ బసవేశ్వరుడి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు పొగాకు నాగరాజు, ఏబీసీడబ్ల్యూవోలు పి.ఎస్తేర్, ఎ.సంజీవయ్య, జిల్లా అధికారులు, సంఘ సభ్యులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండల కేంద్రంలో బసవేశ్వరుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. పావురాలగూడెం బస్‌స్టేజీ వద్ద ఉన్న బసవేశ్వరుని విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గుండా దుర్గయ్య, గుండా నాగయ్య, గుండా శంకర్, బల్లెం లక్ష్మయ్య, నిమ్మల రాములు, కడమంచి రాంబాబు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయాలి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మేడే వేడుకలను ఘనంగా నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న పిలుపునిచ్చారు. వాడవాడలా కార్మిక దినోత్సవ పతాకాలను ఎగురవేయాలన్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లా డారు. ప్రతీ వాడలో ఎర్రజెండా ఎగురవేసేలా పార్టీ శ్రేణులు కార్మికులను చైతన్య పరచాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు దండు రవి, కొప్పు శ్రవణ్, ఆమనగంటి ఐలయ్య, బొల్లెద్దు సైదులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆసరా స్వచ్ఛంద అధ్యక్షుడు మేడి హరికృష్ణ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ తరుణ్, సర్వేయర్ శ్రీనివాస్, సిబ్బంది వెంకన్న, శంకర్, ప్రవీణ్, రాజేశ్వరి, సంధ్య, కృష్ణ, మహేష్, మనం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు దైద నాగరాజు, మల్లేష్, రాందాసు, రాజు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

శాలిగౌరారం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో భాగంగా ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జమ్ము రమేష్ విమర్శించారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా రైతుభరోసా రెండు సీజన్లు ఇవ్వలేదని, రూ.2లక్షల రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసిందని అన్నారు. గృహలక్ష్మి పేరుతో గృహిణులకు ప్రతినెలా రూ.2500 ఇస్తామన్న హామీ అమలు చేయలేదని అన్నారు. గ్రామాలకు బస్సులు రాక గ్రామీణ మ హిళలకు ఉపయోగ పడటం లేదని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయ డంలో విఫలమైన ప్రభుత్వం, పజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడానికి సి ద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు.

చామల యాదగిరిరెడ్డికి ఘన నివాళి

శాలిగౌరారం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, గాంధేయవాది, రాష్ట్రపతి అవార్డు గ్రహీత చామల యాదగిరిరెడ్డి వర్ధంతిని శాలిగౌరారంలో నిర్వహించారు. యాదగిరిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, రైతు సంఘం నాయకులు చామల వెంకటరమణరెడ్డి, సింగల్‌విండో వైస్ చైర్మన్ సీఎం రెడ్డి, నాయకులు చామల జైపాల్‌రెడ్డి, గూని వెంకటయ్య, మాజీ ఎంపీటీసీలు నోముల జనార్దన్, జోగు శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్లు కూతాటి సోమయ్య, రమేష్, సత్తయ్య పాల్గొన్నారు.

ప్రతిభ చూపి.. పదిలో మెరిసి

నల్లగొండటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించా రు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరిగిన పదో తరగతి పరీక్షకు సంబంధించిన ఫలితాలు బుధవారం వెల్లడించారు. ఈ ఫలితాల్లో జిల్లాలో మొత్తం 18,636 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 18,054 మంది (96.88 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

సత్తా చాటిన 'ఏకలవ్య' విద్యార్థులు


శమితారెడ్డి


శ్రీజ

పది ఫలితాల్లో శివాజీనగర్‌కు చెందిన ఏకలవ్య పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. పాఠశాలకు చెందిన ఎం.శమితారెడ్డి 584 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచారు. అదేవిధంగా టి.శ్రీజ 580 మార్కులు, జి.సాయిశ్రీనివాస్ 578, ఆర్. ఉషావైష్ణవి 576, టి.బిందుశ్రీ 573 మార్కులు, జి.లహరి 571 మార్కులు సాధించగా మరో 25 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు, 89మంది విద్యార్థులు 500మార్కులకు పైగా సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను ఉపాధ్యాయులను, బోధనేతర సిబ్బందిని పాఠశాల చైర్మన్ అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, మారం శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

'ఎంవీఆర్' విద్యార్థుల రికార్డు

పది ఫలితాల్లో ఎంవీఆర్ విద్యార్థులు సత్తా చాటి పట్టణంలోనే టాప్ ర్యాంకు సాధించి రికార్డు సాధించారు. పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు 550కి పైగా 19 మంది 540కి పైగా, 78 మంది 500కు పైగా మార్కులు సాధించారు. పాఠశాలకు చెందిన వి.అక్షితారెడ్డి 586, డి.ప్రణయారెడ్డి 571, టి.దీక్షితారెడ్డి 571, సీహెచ్.మీనాక్షి, అఫీపా యజ్మా 570, బి.బిందు 567, ఏ.అంజలి, ఎం.మనస్విని 563, ఏ.విసీల 562, వి.స్నేహ 560, ఎండీ.సుహైబ్ 558, వై.మోక్షశ్రీ 557, వి.కిరణ్‌కుమార్ 555, ఎస్. నిత్యారెడ్డి, కె.హర్షిత్‌రెడ్డి 552, పి.గాయత్రి 549, ఆర్.సాహితీ 546, ఎన్.హేమంత్‌కుమార్ 544మార్కులు సాధించి సత్తాచాటారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎంవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ అండ్ కరస్పాండెంట్ కొలనుపాక గీతరవికుమార్, ప్రిన్సిపాల్ మేరెడ్డి రఘునందన్‌రెడ్డి, ఐఐటీ డీన్ అహ్మద్ అలీ, ఎంవీఆర్ శాంతినగర్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్యాణ్ శ్రీనివాసరావు అభినందించారు.


పదిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంవీఆర్ యాజమాన్యం

సాందీప్ స్కూల్ విజయదుందుభి


జయ ప్రసన్న


వైష్ణవి

పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల సాందీప్ స్కూల్ పది ఫలితాల్లో విద్యార్థులు విజయదుందుభి మోగించారు. పాఠశాలకు చెందిన 42 మంది విద్యార్థులు ప్రతిభ చాటి 100శాతం ఫలితాలు సాధించడమే కాకుండా 566 మార్కులతో పట్టణంలోని నెంబర్‌వన్‌గా నిలిచింది. 20 మందికి పైగా విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవహారకర్త గానుతుల సత్యనారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అందుకు సహకరించిన విద్యార్థులను అభినందించారు.

● నల్లగొండ పట్టణంలోని ఎస్వీఆర్ విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలకు చెం దిన 20మంది విద్యార్థులు 550పైగా మార్కులు సాధించారు. పాఠశాల కు చెందిన జి.సాత్విక్ 585, ఆర్.అఖిల్‌రెడ్డి 577, వి.ఉదయ్‌కుమార్ 564, ఏ.శృతి 564, జె.వినయ్, ఎం.సంజన 562, పి.వర్షిణి, ఎన్.అభిరాం 561, బి.రేవంత్, బి.సిరిచందన, జి.శ్రీజ 560మార్కులు, టి.శర్వాణి, ఎం.శ్రీనిధి 558, వై.శ్రీసాయి ప్రజ్ఞాన్ 557, పి.మనసిని 556, ఎస్.శ్రేణిరెడ్డి 554, పి. వీరేంద్ర, ఎం.శరణ్‌తేజ 551, బి.యశ్వంత్, బి.సోనాలీవైష్ణవి 550మార్కుల చొప్పున సాధించారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ బి.హిమవంతరెడ్డి, కరస్పాండెంట్ ఎస్.రాంరెడ్డి, అకాడమీ డైరెక్టర్ కె.వరప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ఆంథోని, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

● నల్లగొండబ పట్టణంలోని రామగిరిలో గల స్రవంతి హైస్కూల్ విద్యార్థులు పది పరీక్షలో ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించగా వారిలో 14మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు పొందారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు నోమిక 556, జి.నిమిత 555, డి.శ్రీలక్ష్మిప్రణతి, వై.శివసాత్విక్ 542, జి.వర్షిణి 538 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులను కరస్పాండెంట్ వారణాసి రజనీకాంత్, ప్రిన్సిపాల్ ఎస్‌యువీ రమణ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

● పట్టణానికి చెందిన ఆల్ఫా పాఠశాల విద్యార్థులు నూటికి నూరుశాతం ఫలితాలు సాధించి ఆల్‌టైం రికార్డు సృష్టించారు. పాఠశాలకు చెందిన ఎం.జయంత్ 536, సీహెచ్.ఆరాధ్య 523, జి.సుష్మిత 519, వి.భవిక 518, వి.కావ్య 515, వి.స్పందన 512, నిషాంత్ ఫిర్దాస్ 506, సీహెచ్.నాన్సు 503, పి.వీణ 502, వి.లహరి 485 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఆల్ఫా విద్యా సంస్థల చైర్మన్ బాదిని నర్సింహగౌడ్ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

● పదవ తరగతి ఫలితాల్లో పట్టణానికి చెందిన ఓక్‌ట్రీ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రభంజనం సృష్టించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు నూటికి నూరుశాతం ఫలితాల సాధించగా కొప్పుల అక్షయ 577, పెనుగొండ సుహాస్ 573, కొప్పురపు ఆగస్త్యేయ 567, గంజి హారిక 567, చెరుకు యశ్వంత్ 565, బండారు దేవహర్షిణి 564, ఎద్దుల హరీష్ రెడ్డి 564, మోదుగు జశ్వంత్‌రెడ్డి, ఉప్పుల లక్ష్మీప్రణతి 560 మార్కులు సాధించగా మరో 34మంది 500కుపైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గింజల నరేందర్ రెడ్డి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. పాఠశాలకు గౌరవం తీసుకువచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులను చైర్మన్‌తో పాటు డైరెక్టర్ మంగారెడ్డి ఉపాధ్యాయ బృందం అభినందించారు.

● పదవ తరగతి ఫలితాలల్లో పట్టణంలోని నారాయణ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలకు చెందిన నాగవైష్ణవి 588 మార్కులు సాధించి నెంబర్‌వన్‌గా నిలిచింది. రుషికేష్ 584మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. వారిని నారాయణ స్కూల్ ఏజీఎం మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ దివ్యారెడ్డి, సైదులు, సిబ్బంది అభినందించారు.

● జిల్లా కేంద్రంలోని యాటకన్నారెడ్డి కాలనీలో గల న్యూస్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. పాఠశాలకు చెందిన జి.వాగ్దేవి 573, ఎం.యోజన 569, ఎస్.సాత్విక 564, ఎం.నందకిషోర్ రెడ్డి 562, సీహెచ్. రేవంత్‌సాయి 560, ఎం.ప్రణతి 559, కె.సాయిప్రసన్న 558, ఎం.జగన్మోహన్‌రెడ్డి 554, జి.వివేకానంద 553 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గట్ల అనంతరెడ్డి మాట్లాడుతూ పరీక్షకు హాజరై ప్రతి విద్యార్థి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత కావడం ప్రతి విద్యార్థిపై తీసుకునే శ్రద్ధకు నిదర్శనమన్నారు.

పది ఫలితాలల్లో 'ప్రేరణ' విద్యార్థుల హవా

పదవ తరగతి ఫలితాల్లో పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల ప్రేరణ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన 32 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఎం.సాత్విక్ 569, ఎన్.కేశంత్ 554, బి.శివతేజ 550, వి.శ్రీచరణ్ 549, పి.యశ్వంత్ 540, బి.జీవన్ 539, ఎం.సాత్విక్ 538, సీహెచ్.శేఖర్ 535, ఎ.శివతేజ 535, ఆర్.రేవంత్ 532, ఏ.అజయ్ 531, ఎస్.మణితేజ 526, వై.గౌతమ్‌రెడ్డి, పి.శ్రీనిధి 525, కె.భవాని 524 మార్కులు సాధించి సత్తా చాటారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు పాఠశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, యాజమాన్యం అభినందించారు.


ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న పేరణ యాజమాన్యం

ఆంధ్రజ్యోతి
MAY
Happy Internation Workers Day
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 1 మే 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.155	235	260
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 24.0



పేట సభలో ఎమ్మెల్యే మందుల సామేలుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

తుంగతుర్తి కాంగ్రెస్‌లో చిచ్చు

- సూర్యాపేట జిల్లా పార్టీ సమావేశంలో రగడ
- ఎమ్మెల్యే వర్గంపై కాంగ్రెస్ పాత నేతల అసమ్మతి
- ఏడాది కాలంగా సాగుతున్న వర్గపోరు
- అధిష్ఠానం కలగజేసుకోకుంటే పరిస్థితి చేజారి పోతుందని కార్యకర్తల ఆందోళన

తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్‌లో వర్గపోరు ముదురుతోంది. మందుల సామేలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక రెండు, మూడు నెలలపాటు కలిసికట్టుగా ఉన్న క్యాడర్‌లో ఆ తర్వాత విభేదాలు మొదలయ్యాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కుమ్ములాటల నేపథ్యంలో పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహే‌ష్‌కుమార్‌గౌడ్‌కు నాయకులు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. తాజాగా, బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేయడం విభేదాలు తారస్థాయికి చేరాయని పార్టీ కార్యకర్తలు పేర్కొంటున్నారు.

\- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

సూర్యాపేటలో బుధవారం జరిగిన పార్టీ సమావేశానికి పీసీసీ పరిశీలకులుగా ఎమ్మెల్యేలు మురళినాయక్, ఎడ్మబొజ్జు హాజరయ్యారు. ఎమ్మెల్యే సామేలు సమావేశంలోకి రాగానే వారి సమక్షంలోనే అర్వపల్లి మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా ఎంపికచేసి కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశం రసాభాసగా మారే పరిస్థితి నెలకొనడంతో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, తదితర నాయకులు కలగజేసుకొని సమావేశంలో నిరసన లు వద్దని, ఇబ్బందులు, వాదనలను పార్టీకి నివేదించాలని సూచించి విషయం ముదరకుండా నిలువరించడంతో పరిస్థితి సర్దుమణిగింది.

ఏడాదిగా గ్రూప్‌వార్

తుంగతుర్తి ఎమ్మెల్యేగా మందుల సామేలు ఎన్నికైన మూడు నాలుగు నెలల నుంచే వర్గవిభేదాలు మొదలయ్యాయి. నియోజకవర్గంలోని పాత కాంగ్రెస్ నాయకులకు, సామేలుతో కలిసి కాంగ్రెస్‌లోకి వచ్చిన కొత్త కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలు పొడసూపడంతో నియోజకవర్గవ్యాప్తంగా వర్గపోరు ప్రారంభమైంది. ప్రధానంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్‌యువవికాసం లబ్ధిదారుల ఎంపికలో పాత కాంగ్రెస్ కార్యకర్తలకు అవకాశం దక్కడం లేదని, ఎమ్మెల్యే బీఆర్ఎస్ నుంచి వచ్చిన కార్యకర్తలకు మాత్రమే ఈ పథకాల్లో ప్రాధాన్యమిస్తున్నారని ఆయన్ను వ్యతిరేకిస్తున్న వర్గీయుల ప్రధాన ఆరోపణ. అయితే అలాంటిదేమీ లేదని, పార్టీలో అందరినీ కలుపుకుపోతున్నామని, సీనియర్లను గౌరవిస్తున్నామని సామేలు చెబుతున్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపికలో అర్హులైనవారికే అవకాశం ఇస్తున్నారని, నిబంధనల మేరకే లబ్ధిదారుల ఎంపిక ఉంటుందనేది ఎమ్మెల్యే వర్గీయులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో ప్రతీ మండలంలో బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యమిస్తూ వారు చెప్పిందే అమలయ్యేట్టు అధికారులను ఎమ్మెల్యే పురమాయిస్తున్నారని, ఇటీవల చేపట్టిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులను సైతం బీఆర్ఎస్ నుంచి వచ్చిన, తనకు అనుకూలమైన వ్యక్తికే పనుల బాధ్యత అప్పగించారని ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సామేలు తీవ్రస్థాయిలో విమర్శించిన బీఆర్ఎస్ నాయకుడినే ఇప్పుడు చేరదీసి, ఆయన కనుసన్నల్లో మండలాన్ని నడపాలని చూస్తున్నారని, మరో రెండు మండలాలకు చెందిన కీలక నాయకులిద్దరు ఇప్పటికీ బీఆర్ఎస్ నేతలతో టచ్‌లో

అధిష్ఠానానికి ఫిర్యాదులు

తుంగతుర్తి నియోజకవర్గంలో పార్టీ రెండు వర్గాలుగా విడిపోయిన విషయం ఇప్పటికే అధిష్ఠానం దృష్టిలో ఉంది. గతంలో ఇలాగే అసమ్మతి కార్యక్రమాలు జరిగినప్పుడు పీసీసీ అధ్యక్షుడు మహే‌ష్‌కుమార్‌గౌడ్‌కు, తాజాగా పీసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నాయి. నియోజకవర్గంలో సమన్వయ కమిటీని నియమించి, అసమ్మతి లేకుండా చేస్తామని పీసీసీ అధ్యక్షుడు హామీ ఇచ్చినా ఇంతవరకు కమిటీ నియమించలేదు. తాజాగా మళ్లీ గలాటా జరగడంతో ఇకనైనా పార్టీ అధిష్ఠానం దృష్టి సారించి అసమ్మతిని నద్దుమణిచే చర్యలు చేపట్టాలని సీనియర్ నాయకులు విన్నవిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తినాల్సి వస్తుందని, పైగా పార్టీ పట్టుకోల్పోతుందన్న విషయాన్ని అధిష్ఠానం గ్రహించాలని సూచిస్తున్నారు.

మిగతా 6వ పేజీలో...



10లో 11వ స్థానం

- 96.88శాతం ఉత్తీర్ణత నమోదు
- సత్తాచాటిన బాలికలు
- 97.38శాతం ఉత్తీర్ణత
- 264 పాఠశాలల్లో 100శాతం ఫలితాలు
- యాదాద్రి జిల్లాకు ఏడో స్థానం
- 14వ స్థానంలో సూర్యాపేట

నల్లగొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరిగిన పదో తరగతి పరీక్ష ఫలితాలను ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. జిల్లాలో మొత్తం 18,636మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 18,054 మంది (96.88శాతం) ఉత్తీర్ణత సాధించారు. యాదాద్రి జిల్లాలో మొత్తం 8,622మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 8,432మంది (97.80శాతం) ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రస్థాయిలో యాదాద్రి జిల్లా ఏడో స్థానంలో నిలిచింది. సూర్యాపేట జిల్లాలో 11,887మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 11,508 మంది (96.81 శాతం) ఉత్తీర్ణత సాధించారు. పేట జిల్లా రాష్ట్ర స్థాయిలో 14వ స్థానంలో నిలిచింది.

జిల్లాలో మొత్తం బాలురు 9,586మంది పరీక్షలు రాయగా, 9,241మంది (96.40శాతం) ఉత్తీర్ణులు కాగా, బాలికలు 9,050మంది పరీక్షలు రాయగా, 8,813మంది (97.38శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఈసారి 264 పాఠశాలల్లో నూటికి నూరు శాతం ఫలితాలు వచ్చాయి. రీకౌంటింగ్ కోసం వచ్చే నెల 15వ తేదీ వరకు ఒక్కో సబ్జెక్టు రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా మే 16వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని, అపరాధ రుసుముతో ప్రతీ పరీక్షకు రెండు రోజుల ముందు వరకు విద్యార్థులు ఫీజును చెల్లించవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు. అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరగనున్నాయి.

264 పాఠశాలల్లో నూరు శాతం ఫలితాలు

జిల్లాలోని 264 పాఠశాలల్లో నూరు శాతం ఫలితాలు వచ్చాయి. జడ్పీ పరిధిలోని 108 ప్రభుత్వ పాఠశాలలు, 106 ప్రైవేట్ పాఠశాలల్లో నూరు శాతం ఫలితాలు వచ్చాయి. ఒక ఎయిడెడ్ పాఠశాల, ఒక ఆశ్రమ పాఠశాల, 7 బీసీ వెల్ఫేర్ పాఠశాలలు, 6 ప్రభుత్వ, 13 కేజీబీవీ, 7 మోడల్ స్కూళ్లు, 4 మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, 7 సాంఘిక సంక్షేమ పాఠశాలలు, 4 ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో నూరు శాతం ఫలితాలు వచ్చాయి.

జిల్లా విద్యాశాఖ 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహించడంతో పాటు విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఉత్తీర్ణత శాతం మెరుగుపడింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు మెరుగుపడ్డాయి. జడ్పీ పరిధిలోని 108 పాఠశాలల్లో 100శాతం ఫలితాలు రావడం గమనార్హం. అదేవిధంగా కేజీబీవీలు, బీసీ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ, మైనార్టీ రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లలో కూడా ఆశించిన ఫలితాలు వచ్చాయి.

ఉమ్మడి జిల్లాలో ఫలితాలు ఇలా..

జిల్లా	హాజరు	ఉత్తీర్ణత	శాతం
నల్లగొండ	18.636	18.054	96.88
సూర్యాపేట	11.887	11.508	96.81
యాదాద్రి	8.622	8.432	97.80

ఏఎమ్మార్పీ హైలెవల్ కెనాల్‌కు రూ.442కోట్లు

- పట్టుబట్టి నిధులు సాధించిన మంత్రి వెంకట్‌రెడ్డి
- జీవో 80 ద్వారా పరిపాలనా అనుమతులు



నల్లగొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఎస్ఎల్‌బీసీ-ఏఎమ్మార్పీ హైలెవల్ కెనాల్ సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టుబట్టి ఈ పనులకు నిధులు సాధించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏఎమ్మార్పీ హైలెవల్ కెనాల్‌కు సీసీ చేయిస్తానని, అందుకు ఎన్ని నిధులైనా మంజూరు చేయిస్తానని వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నల్లగొండ జిల్లా పర్యటనలో, తాజాగా మంగళవారం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఈ పథకానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి వెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం రూ.442కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరుచేస్తూ నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జా జీవో 80ని విడుదల చేశారు. ఏఎమ్మార్పీ హైలెవల్ కెనాల్ 23.500కిలోమీటర్ నుంచి 136.150 కిలోమీటర్ వరకు సుమారు 112.650 కిలోమీటర్ల మేరకు సీసీ లైనింగ్ చేపడతారు. 1983లో ఎస్ఎల్‌బీసీ కింద ఈ కాల్వ నిర్మాణం చేపట్టగా, ఏఎమ్మార్పీ లిఫ్టు ద్వారా ఈ కాల్వను అనుసంధానం చేసి పుట్టంగండి ఎత్తిపోతల నుంచి నీటిని తీసుకునే పథకంగా మార్చారు. దీన్ని 2001లో ప్రారంభించారు.అప్పటి నుంచి ఈ కాల్వకి సీసీ లైనింగ్ చేపట్టాలనే డిమాండ్ ఉంది. కాల్వకు నీటివిడుదల సమయంలో గండ్లుపడడం, కట్టలు బలహీనమవడం వంటి సమస్యలు తరచూ తలెత్తుతున్నాయి. కాల్వ నీటి సామర్థ్యం తగ్గడంతో ఆయకట్టు చివరి భూములకు నీరందని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని రైతులు గత ఎన్నికల సమయంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా, కెనాల్‌కు లైనింగ్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.442కోట్ల నిధులు మంజూరవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీలైనంతవేగంగా టెండర్ల ప్రక్రియ ముగించి పనులు వేగంగా చేపట్టి పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

సీఎం, ఇరిగేషన్ మంత్రికి కృతజ్ఞతలు



2.20లక్షల ఎకరాల ఆయకట్టు, 516 గ్రామాలకు తాగునీరందించే ఎస్ఎల్‌బీసీ-ఏఎమ్మార్పీ హైలెవల్ కెనాల్ పటిష్టత కోసం సీసీ లైనింగ్‌కు ప్రభుత్వం రూ.442కోట్ల నిధులు కేటాయించడం సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు. 42 ఏళ్ల కిందట నిర్మించిన ఈ కాల్వకు లైనింగ్ లేకపోవడంతో ఆయకట్టు చివరివరకు నీరందని పరిస్థితి ఎదుర్కొన్నాం. ఆయకట్టు రైతులకు ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేయించాం. వీలైనంత త్వరగా పనులు చేపట్టి పూర్తి, చేయించి ఆయకట్టు అభివృద్ధికి కృషి చేస్తా.

\- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రి

అమరుల పోరాటాలు చరిత్రలో నిలుస్తాయి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

గట్టుప్పల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజల పక్షాన నిలిచిన సీపీఎం కార్యకర్తలు, నాయకుల పోరాటాలు, వారి త్యాగాలు చరిత్రలో నిలుస్తాయని పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. బుధవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో సీపీఎం అమరుల సంస్మరణ సభకు ఆయన హాజరై 136 మంది అమరులైన వారి కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదల పక్షాన నిలబడి ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై నిరంతరం పోరాటాలు నిర్వహించే పార్టీ సీపీఎం అని అన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తూ, దేశ సంపదను తాకట్టు పెడుతోందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అమరుల కుటుంబాలకు చెందిన పలువురు ఈ సందర్భంగా సీపీఎంలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు బండ శ్రీశైలం, కట్ట నరసింహ, కర్నాటి మల్లేశం, చాపల మారయ్య, కర్నాటి సుధాకర్, గోపాల్ రెడ్డి, మాల్గ శ్రీశైలం, పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలి

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ పూర్తి చేయాలని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రబీ ధాన్యం సేకరణను పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ, కొంతమంది మిల్లర్లు హెచ్ఎన్‌పీ, ఆర్ఎన్ఆర్, 1638 ధాన్యం నూకలు ఎక్కువగా అవుతున్నాయనే సాకుతో దిగుమతి చేసుకోవడం లేదని, దీనిపై దృష్టిసారించాలన్నారు. మిల్లర్లు ఎట్టి పరిస్థితుల్లో తరుగు తీయవద్దన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, రబీ ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. జిల్లాలోని మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసుకునేలా ప్రతీ మిల్లుకు 200శాతం కేటాయింపులు చేశామన్నారు. మిల్లుల సామర్థ్యం మేరకు ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకుంటున్నా, వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో ధాన్యం నిల్వ ఉంచేందుకు అవకాశం ఇస్తే బాగుంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ హరీష్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నీట్‌కు ఏర్పాట్లు చేయాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్)కు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రవేశ పరీక్ష మే 4 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని, జిల్లాలో 2,048 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్టు తెలిపారు.


అందుకు జిల్లా కేంద్రంలో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎక్కడా తప్పులు జరగకుండా పరీక్షలను నిర్వహించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు నారాయణ్‌అమిత్, రాజ్‌కుమార్, అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ శివరామిరెడ్డి, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్, చింతపల్లి): అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం నల్లగొండ మండలం చందనపల్లి పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. ధాన్యం ఎగుమతికి లారీల సంఖ్య పెంచి, మిల్లులకు వెంటనే తరలించాలని ఆదేశించారు. అదేవిధంగా ఆర్జాలబావి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేసి ధాన్యం రాశులు ఎక్కువగా ఉండటంతో మరో ఐదు లారీలను అదనంగా ఏర్పాటుచేసి 10 రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకాల వర్షాలకు రైతులు నష్టపోకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ హరీష్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, పీఏసీఎస్ ఛైర్మన్ ఆలకుంట్ల నాగరత్నంరాజు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చింతపల్లి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో సుజాత, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

- మక్తల్ ఎమ్మెల్యే, జిల్లా పరిశీలకుడు వాకటి శ్రీహరి ముదిరాజ్
- ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న వాకటి శ్రీహరి ముదిరాజ్

నల్లగొండటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని, సంక్షేమ పథకాలు అందుతున్నాయని మక్తల్ ఎమ్మెల్యే, జిల్లా పరిశీలకుడు వాకటి శ్రీహరి ముదిరాజ్ అన్నారు జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని సమస్యలను అధిగమిస్తూ పేదల సంక్షేమమే ధ్యేయంగా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుచేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం లభిస్తుందని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికలలో వారికి అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తప్పనిసరిగా న్యాయం జరుగుతుందని అన్నారు. సంయమనం పాటిస్తే త్వరలో వారికి మంచి అవకాశాలు వస్తాయని అన్నారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే వారికి రానున్న ఎన్నికల్లో, ఇతర పదవులలో అవకాశాలు లభిస్తాయని అన్నారు. కార్యక్రమాలు జరిగినప్పుడు ఫొటోలకు ఫోజులు ఇచ్చే నాయకులు అవసరం లేదని, వారి స్థానంలో త్వరలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని అన్నారు. పార్టీ బలోపేతమే ధ్యేయంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మరో పరిశీలకుడు నసీర్ అహ్మద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం జెండా మోసిన కార్యకర్తలకు తప్పకుండా న్యాయం జరుగుతుందని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీచైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు జూకూరి రమేష్, అంకతి సత్యం, గోపగాని మాధవి, తదితరులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం హర్షణీయం

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని నిర్ణయించడం హర్షనీయమని బీసీ సంక్షేమ సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. బుధవారం సుందర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కర్నాటి శివరామకృష్ణ, సరికొండ రామకృష్ణంరాజు, గునగంటి వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

నిడమనూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే దోహదం చేస్తుందని నిడమనూరు ఎస్‌ఐ ఉప్పు సురేష్ అన్నారు. మండల కేంద్రంలో సుమన్ షోటోకాన్ స్పోర్ట్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోతుగంటి శ్రీనివాస్, కోట్ల సైదులు, రాజు, రూప, భవ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ..‘పది’లో మెరిసి

- పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ
- పలు ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత



మిర్యాలగూడ పట్టణంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీఆర్ ఉన్నత పాఠశాల యాజమాన్యం



మిర్యాలగూడ పట్టణంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించి స్వీటు తినిపిస్తున్న ఆదిత్య పాఠశాల యాజమాన్యం

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : పదోతరగతి పరీక్షల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా ప్రతిభ కనబర్చారు.

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని 14 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఐదు పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో లావూరిబాలు తెలిపారు. 96 శాతం ఉత్తీర్ణత శాతం సాధించినట్లు పేర్కొన్నారు.

ప్రైవేటు పాఠశాల విద్యార్థుల ప్రతిభ



హాన్సిక, నిశాంత్

మిర్యాలగూడ పట్టణంలోని కాకతీయ ఉన్నతపాఠశాల విద్యార్థులు పది ఫలితాల్లో సత్తా చాటారు. పాఠశాల విద్యార్థులు తుమ్మలపల్లి హన్సిక, కక్కిరేణి నిశాంత్ 578 మార్కులు సాధించారని డైరెక్టర్ చీదళ్ల వెంకట్ తెలిపారు. జె. ప్రణతి, సాయిశ్రీ 570 మార్కులు సాధించగా, మొత్తం 92 మందిలో 69 మంది విద్యార్థులు 500లకు పై గా మార్కులతో అగ్రబాగాన నిలిచారన్నారు. కాగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ గుండా హరినారాయణ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలోప్రిన్సిపాల్ సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- ఎస్పీఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పది ఫలితాల్లో అగ్రభాగాన నిలిచారని డైరెక్టర్ గార్లపాటి ఉమాకర్‌రెడ్డి తెలిపారు. జే.కృతికారెడ్డి 580 అమ్మర నస్రీన్ 576 సీహెచ్ ప్రియదర్శిని 575 మార్కులు సాధించారన్నారు. మరో 20 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నీలిమారెడ్డి, అయ్యన్న, శ్రీనివాసరెడ్డి, రోహిత్‌కుమార్ పాల్గొన్నారు.
- ఆదిత్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి తెలిపారు. ఎం. ఇందు 573 జీ. అక్షయ 570, సీహెచ్. వెన్నెల 563, సాయిశ్రీ 562, బీ. భవానీ 557, రెహ్మాన్ 555, జ్ఞానేశ్వర్ 554, నందిని 552, జీవన్‌కుమార్ 550 మా ర్కులు సాధించడం ఆదర్శనీయమన్నారు. అనంతరం విద్యార్థులను అభినందిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ అనిత పాల్గొన్నారు.
- ఎస్వీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఓరుగంటి శ్యాంసుందర్ తెలిపారు. గోరంట్ల శ్రావణి 567/600 మార్కులు సాధించగా, మరో 13 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ విశాలక్ష్మి ఉపాధ్యాయులు నాగలక్ష్మి, రత్నమాల, శ్రవణ్, జాఫర్, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి మండలంలో 98శాతం ఉత్తీర్ణత

వేములపల్లి : మండలంలో పది ఫలితాల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలల నుంచి 232 మంది పరీక్షలకు హాజరు కాగా 229 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఆమనగల్లు జడ్పీ హై స్కూల్‌కు చెందిన నర్సింగోజు ఆకాంక్ష 546 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు.

దామరచర్లలో 99 శాతం ఉత్తీర్ణత

దామరచర్ల :మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు



శివానిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ లిమామేరి

చెందిన మొత్తం 455 మంది పరీక్షలు హాజరుకాగా 452 మంది పాస్‌కాగా 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో బాలాజీనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని నకిరేకంటి శివాని 550 మార్కులు సాధించడంతో పాఠశాల యాజమాన్యం శివానితో పాటు తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్ లిమామేరీ, ఉపాద్యాయలు బైరం సత్యనారాయణ, శ్రీను, హనుమాన్, జాన్‌పీటర్, రాణి పాల్గొన్నారు.

అడవిదేవుపల్లిలో వందశాతం



శ్రీఈశ్వరి

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఎంఈవో వరలక్ష్మి తెలిపారు. జల్లెడ శ్రీఈశ్వరి 553 ఇరపూరి సిద్దార్థ 539, కట్ల చరణ్య 513 మార్కులు సాధించినట్లు చెప్పారు 59 మందికి 59 మంది పాసై వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అలాగే కేజీబీవీలో కుర్ర మధు 520 మార్కులు, పాతులోతు సాయిప్రియ 504, కొమిరిశెట్టి ప్రజ్వల 500 మార్కులు సాధించడంతో 26 మందికి 26 మంది పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో నాగలక్ష్మి తెలిపారు.

హాలియాలో 99 శాతం ఉత్తీర్ణత



పి.హర్షిత్, గీతాంజలి,అభిలాష్

హాలియా : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో గుండా కృష్ణమూర్తి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మొత్తం 165 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 162 మంది పాస్ కాగా 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. హాలియా మండల కేంద్రానికి చెందిన ఆకాంక్ష పాఠశాలకు చెందిన పి.హర్షిత్ 574, డి.శ్రీసాన్వి 556, ఎమ్.తిలక్ 555, రమ్యశ్రీ 554, వైష్ణవి 553, తరుణి 551, లాస్య 551, నవ్యశ్రీ 550 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. 28 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. అలాగే కృష్ణవేణి పాఠశాల విద్యార్థి గీతాంజలి 559 మా ర్కులు సాధించగా 27 మంది విద్యార్థులు 500పైన మార్కులు సాధించినట్లు పాఠశాల చైర్మన్ నిమ్మల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. లక్ష్య పాఠశాలకు చెందిన ఏ.అభిలాష్ 559 సాధించగా, 18 మంది విద్యార్థులు 500పైన మార్కులు సాధించినట్లు డైరెక్టర్ నాగెండ్ల విజయభాస్కర్‌రెడ్డి, టైం పాఠశాలకు చెందిన జాహ్నవి 556 సాధించగా 17 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించినట్లు డైరెక్టర్ మందా నరేందర్‌రెడ్డి, అక్షయ హైస్కూల్‌లో ఎమ్.కార్తీక్ 549 మార్కులు రాగా పాఠశాలకు చెందిన 7 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి చెప్పారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను యజమాన్యం, తల్లి దండ్రులు అభినందించారు.



జహ్నవి డి.శ్రీసాన్వి, తిలక్

నిడమనూరు మండలంలో 97.78 శాతం



గుగులోతు గణేష్ వర్షిత

నిడమనూరు : మండలంలో మొత్తం 464 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 456 మంది ఉత్తీర్ణులయ్యారు. 97.78 శాతం ఉత్తీర్ణత సాధించారు. గురుకుల విద్యార్థులు గుగులోతు గణేష్ 560, వర్షిత 554, తుమ్మడం జడ్పీ విద్యార్థి సాయిరాం 547, మోడల్ స్కూల్ విద్యార్థులు బండారు పూజిత 526, బండారు గీతిక 521, నారమ్మగూడెం జడ్పీ విద్యార్థి సాత్విక 520, లిటిల్ ఏంజిల్స్ విద్యార్థి హర్షిత 516 మార్కులు సాధించారు. తొమ్మిది పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణులయ్యారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

గుర్రంపోడు మండలంలో 95శాతం

గుర్రంపోడు : మండలంలో పదోతరగతి ఫలితాల్లో 95.2శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో నేముల యాదగిరి తెలిపారు. జడ్పీహెచ్‌ఎస్ తేనేపల్లి, జడ్పీహెచ్‌ఎస్ చేపూరు, కేజీబీవీ పాఠశాలలు నూరుశాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలో 272 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 259 మంది ఉత్తీర్ణులయ్యారు. పా ల్వాయి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.అక్షయ 532 మార్కులు సాధించినట్లు హెచ్‌ఎం ఎం. విజయలక్ష్మి చెప్పారు.

దేవరకొండ మండలంలో 93.9 శాతం ఉత్తీర్ణత

దేవరకొండ : దేవరకొండ మండలంలో 1,193 మంది విద్యార్థులు హాజరు కాగా 1,120 మంది పాస్ కాగా 93.9 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు దేవరకొండ ఎంఈవో మాత్రు నాయక్ తెలిపారు. గిరిజన బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో 100శాతం ఫలితాలు వచ్చినట్లు తెలిపారు. పాఠశాలకు చెందిన అంజనసాయి 568 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. గురుకుల బాలుర పాఠశాలలో 69మందికి 67మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఆర్.ధర్మేందర్ 549 మార్కులు సాధించినట్లు చె ప్పారు. అలాగే దేవరకొండ పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ విద్యార్థిని వద్దిరెడ్డి తపస్విని 568 మార్కులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ గుద్దేటి జంగయ్య తెలిపారు.

కొండమల్లేపల్లి మండలంలో 92 శాతం



జె.సహస్ర ఆర్.అనూష



బి.స్పందన ఎం.దివ్య

కొండమల్లేపల్లి : మండలంలో ప్రభుత్వ పాఠశాలలో 213 మంది విద్యార్థులు హాజరుకాగా 197 మంది పాస్ కాగా 92 ఉత్తీర్ణత శాతం సాధించినట్లు ఎంఈవో తెలిపారు. కొండమల్లేపల్లి పట్టణంలోని ఎస్సీగురుకుల బాలికల పాఠశాలకు చెందిన జె.సహస్ర 574, ఎస్టీ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన ఆర్.అనూష 570, బీసీ గురుకుల పాఠశాలకు చెందిన ఎం.దివ్య 551, జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బి.స్పందన 561 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చారు. మండల కేంద్రంలోని సాయి సిద్ధార్థ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్‌కె.రియా 570, నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ పాఠశాల విద్యార్థినిఇ ఎం.సాయితేజ 569, శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని వి. తన్వీ 561, గౌతమిటాలెంట్ విద్యార్థి భరత్‌కుమార్ 534 మార్కులు సాధించారు.

డిండి మండలంలో 94 శాతం

డిండి :మండలంలో పదోతరగతి పరీక్షలకు 395 మంది హాజరు కాగా 374 మంది పాస్ కాగా 94 శాతం ఉత్తీర్ణలయ్యారు. మోడల్ స్కూల్‌లో 96 మం ది పరీక్షలకు హాజరు కాగా 91 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఆర్.ఘనకీర్తి 549, ఎండీ రెహమత్ ఫాతీమా 541 మార్కులు సాధించి ప్రతిభా చూపారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 81 మంది పరీక్షలకు హాజరుకాగా 81 మంది(100 శాతం) ఉత్తీర్ణులయ్యారు. జడ్పీ ఉన్న త పాఠశాలలో 47 మందికి 42 మంది ఉత్తీర్ణులయ్యారు. కందుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 27 మందికి 24 మంది పాస్‌కాగా(85 శాతం), తవక్లాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 33 మంది పరీక్షలు రాయగా 29మంది(87శాతం), చెర్కుపల్లి ఉన్నత పాఠశాలలో 36 మంది పరీక్షలు రాయగా 35 మంది(98 శాతం), రామాంతపూర్ ఉన్నత పాఠశాలలో 11 మందికి 11 మంది, గోనబోయినపల్లి ఉన్నత పాఠశాలలో 8 మందికి 6 మంది, టి.గౌరారం ఉన్నత పాఠశాలలో 15 మందికి 14 మంది (93శాతం), కామేపల్లి జడ్పీ పాఠశాలలో 22 మందికి 20 మంది (91శాతం), మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో 23 మందికి 21 మంది(91శాతం) ఉత్తీర్ణులయ్యారు.

తిరుమలగిరి (సాగర్)లో 98.7 శాతం



బానాల స్పందన, సాయికుమార్ అఖిల్

తిరుమలగిరి(సాగర్) : మండలంలో గల ప్రభుత్వ పాఠశాలల్లో 77 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 76 మంది ఉత్తీర్ణతతో 98.7 శాతం సాధించారు. మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్‌లో 38 మందికి 37 మం ది ఉత్తీర్ణత సాధించగా పాఠశాలకు చెందిన కె.సాయి, ఆంగోతు అఖిల్ 522 మార్కులు సాధించి ప్రతిభ చూపినట్లు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. అలాగే రాజవరం జడ్పీ హైస్కూల్‌లో 7మందికి 7మంది, కేజీబీవీలో 32 మందికి 32 మందితో వందశాతం ఉత్తీర్ణత సాధించిరు. పాఠశాలకు చెందిన బానాల స్పందన 524 మార్కులు సాధించింది. మండల కేంద్రంలోని గ్రేటివే పాఠశాలలో 26 మందికి 26 మంది పాసైనట్లు ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మచారి తెలిపారు. ఈ పాఠశాలకు చెందిన పిట్టల నందకిశోర్ అనే విద్యార్థి 523 మార్కులు సాదించగా 500 మార్కులకు పైగా ఆరుగురు ద్యార్థులు పొందినట్లు ఆయన తెలిపారు.

చింతపల్లి మండలంలో 98 శాతం



స్రుతిక

చింతపల్లి : మండలంలో పది ఫలితాల్లో 98 శాతం ఉత్తీర్ణత శాతం సాధించినట్లు ఎంఈవో అంజయ్య తెలిపారు. 76 మంది విద్యార్థులు హాజరు కాగా 75 పాసయ్యారు. వీ.టీనగర్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన స్రుతిక (554), ఎగితిక 547, వీరితో పాటు చందన(528), రమాదేవి(522), సనా(510), ఎస్.మానస(508),టి.మానస(505)మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు హెచ్.కృష్ణవేణి, అధ్యాపక బృందం ఎండీ.అన్వర్, బాల్‌రెడ్డి, సుదీర్, శివలీల, సౌజన్య శ్రీవిద్య ప్రత్యేక అబినందనలు తెలిపారు.

పీఏపల్లి మండలంలో 100 శాతం ఉత్తీర్ణత



మణిదీప్

పెద్దఅడిశర్లపల్లి : ఉమ్మడి పీఏపల్లి మండలంలో పదో తరగతి ఫలితాల్లో 315 మంది విద్యార్థులు హాజరు కాగా మొత్తం ఉత్తీర్ణతతో 100 శాతం సాధించినట్లు ఎంఈవోలు సముద్రాల శ్రీనయ్య, వెంకటయ్య తెలిపారు. దుగ్యాల ఆదర్శ పాఠశాలకు చెందిన పున్న మణిదీప్ 559 మార్కులతో మండల స్థాయిలో ప్రతిభ చూపారు. డీపీవీ పాఠశాల (పుట్టంగండి) చుండూరు రమ్య 545, సాయి కృష్ణవేణి పాఠశాల(పీఏపల్లి) డి. లావణ్య 542 దుగ్యాల ఆదర్శ పాఠశాల దనస్విసీ 541 మార్కులు సాధించారు. అనంతరం విద్యార్థులను ప్రిన్సిపల్ మల్లేష్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

సాధన చేస్తే సాధించలేనిదేమీ లేదు : ఎమ్మెల్సీ



విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సాధన చేస్తే సాధించలేనిదేమీ లేదని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్న సుమన్ చోటోఖాన్ కరాటే అకాడమీ క్రీడాకారులను బుధవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమన్ చోటోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడం హర్షణీయమన్నారు.అకాడమీ వ్యవస్థాపకుడు బూడిద సైదులు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో మూడు నిమిషాల్లో 48,808 పంచ్‌లతో హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తమ అకాడమీ క్రీడాకారులు ఆరుగురు ఉం డటం గొప్ప విషయ మన్నారు. రికార్డులో భాగస్వాములైన అపర్ణ, సాయిసాత్విక్, క్షప్రమ్, డేవిడ్ రామ్, సాయి సమిత్రమ్, ప్రద్యుత్, శిక్షణనిచ్చిన కరాటే మాస్టర్ రామకృష్ణనాయక్‌ను ఎమ్మెల్సీ అభినందించినట్లు తెలిపారు.

విద్యార్థుల సంక్షేమానికి కృషి

చింతపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమానికి చేస్తున్నామని వందేమాతరం, ఫ్లైవిలేజ్, శృతి లయా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నితిన్ తెలిపారు. మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్)శాంతినికేతన్ హైస్కూల్‌లో బుధవారం వేసవి శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ఆట, పాటలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యతో పాటు సాంస్కృతిక ప్రోగ్రాంలో పాల్గొన్నప్పుడే ప్రతిభ బయటికి వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌బోదాసు శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ అంగిరేకుల గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటలో మొక్కలు దగ్ధం

అడవిదేవులపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో మంగళవారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని ఆయిల్‌పామ్ తోటలో మొక్కలు, డ్రిప్ పైప్‌లైన్లు దగ్ధమయ్యాయి. గ్రామంలో ఓ రైతు తన పొలంలో పత్తికట్టెను తగులబెట్టడంతో మంటలు వ్యాపించి పక్కనే ఉన్న మంచికల పూడి శంకర్‌రావుకు చెందిన 20 ఎకరాల ఆయిల్‌పామ్ తోటలోని 40 మొక్కలు, డ్రిప్ పైప లైన్లు దగ్ధమయ్యాయి. ఉద్యానవన మిర్యాలగూడ డివిజన్ అధికారి నసీమా బుధవారం ఆయిల్‌పామ్ తోటను పరిశీలించి రైతుకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సుధాకర్, రాజా, రైతు శంకర్‌రావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం మండలంలోని దంజిలాల్‌తండా, చెన్నారం గ్రామాల్లో నిర్వహించిన శ్రీ బర్మస్వామి, గణపతి, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, నాయకులు రమావత్ లలిత, జగన్, భీమ్‌సింగ్, రామకృష్ణా, రాము పాల్గొన్నారు.

పశుసంచార అంబులెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి



1962 అంబులెన్స్‌లో పరికరాలను పరిశీలిస్తున్న బాగిష్‌మిశ్ర

దేవరకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పశుసంచార వైద్య అంబులెన్స్ వెటర్నరి సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పశువైద్యశాల ప్రాజెక్టు అధికారి డాక్టర్ బాగిష్‌మిశ్ర అన్నారు. దేవరకొండలో 1962 పశు సంచార అంబులెన్స్ సేవలను బుధవారం ఆయన అకస్మీకంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో పరికరాల పనితీరును పరిశీలించారు. వివరాలను సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. పాడి రైతులు అంబులెన్స్‌ల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట జిల్లా మేనేజర్ నజీరొద్దిన్, మధు, సిబ్బంది లచ్చిరాం, దేవుల, కృష్ణలు ఉన్నారు.

మూగజీవాలకు అందని వైద్యం

- సిబ్బంది కొరతతో మూతపడిన పశువైద్యశాలలు



చెర్కుపల్లిలో మూతపడిన పశువైద్యశాల

(ఆంధ్రజ్యోతి-డిండి): వైద్య సిబ్బందిలేక మండలంలోని పశువైద్యశాలలు మూతపడ్డాయి. దీంతో మూగజీవాలకు వైద్యం అందడంలేదు. మండలంలోని మూడు పశువైద్యశాలలు, రెండు సబ్‌సెంటర్లు ఉన్నాయి. సిబ్బంది నియామకం లేక వైద్యశాలలు మూతపడ్డాయి. డిండి, చెర్కుపల్లి, తవక్లాపూర్ గ్రామాల్లో పశు వైద్యశాలలు, టి.గౌరారం, గోనబోయినపల్లి గ్రామాల్లో సబ్‌సెంటర్లు ఉన్నాయి. టి.గౌరారం, గోనబోయినపల్లి గ్రామాల్లో కొంతకాలం పశువులకు వైద్యాన్ని అందించారు. పదేళ్లుగా సబ్‌సెంటర్లు సిబ్బంది లేక మూతపడడంతో సెంటర్ల పరిధిలోని గ్రామాల్లో మూగజీవాలకు వైద్యం అందడంలేదు. పశుపోషకులు డిండి మండల కేంద్రానికి రావాల్సి వస్తుంది. డి.నెమలిపూర్, కామేపల్లి, ఎర్రారం, జాల్‌తండా, కె.గౌరారం, గోనబోయినపల్లి, ప్రతాప్‌నగర్, దేవత్‌పల్లి, కందుకూరు, బ్రాహ్మణపల్లి, ఎర్రగుంటపల్లి, వావిల్‌కోల్, శాంతిగూడెం, టి.గౌరారంతో పాటు తండాల రైతులు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న డిండి, తవక్లాపూర్ పశువైద్యశాలలకు పశువులను తీసుకెళ్లే పరిస్థితి. పూర్తిస్థాయిలో పశువైద్య సిబ్బందిలేక అత్యవసర సమయాల్లో సరైన వైద్యం అందక మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయి. ఇప్పటికే మండలంలోని చెర్కుపల్లి, గోనబోయినపల్లి, టి.గౌరారం వైద్యశాలలు మూతపడ్డాయి.

సిబ్బంది కొరత ఇలా..

డిండి పశువైద్యశాలలో అటెండర్(ఓఎస్), కాంపౌండర్(వెటర్నరీ అసిస్టెంట్) పోస్టులు ఖాళీ ఉండగా, చెర్కుపల్లి వైద్యశాలలో డాక్టర్, అటెండర్, వెటర్నరి అసిస్టెంట్, తవక్లాపూర్ వైద్యశాలలో అటెండర్, గోనబోయినపల్లిలో అటెండర్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్(ఎల్ఎస్ఏ), టి.గౌరారం వైద్యశాలలో అటెండర్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి. జిల్లా కేంద్రా నికి వంద కిలోమీటర్ల దూరంలో మండల కేంద్రం ఉండడం వల్ల విధుల్లో చేరేందుకు పశువైద్యశాఖలో పనిచేసే ఉద్యోగులు ముందుకు రావడంలేదు. చెర్కుపల్లి గ్రామంలో ఆసుపత్రి సిబ్బందిలేని కారణంగా వైద్యశాల మూతపడింది. 2019 పశుగణన లెక్కల ప్రకారం మండలంలో 13వేల ప శువులు, 10వేల గేదెలు, 30వేల గొర్రెలు, 11వేల మేకలు, 200కుపైగా పందులు ఉన్నట్లు వైద్యాధికారులు తెలుపుతున్నారు.

వైద్యులను నియమించాలి



మండలంలోని పశు వైద్యశాలల్లో ఖాళీలుగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి. మండలంలో కోళ్ల, డైరీ ఫారమ్‌తోపాటు గొర్రెల, మేకల పెంపకందారులు అనేక మంది వాటిపై ఆధారపడి జీవిస్తున్నారు. వైద్యం అందక మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయి.

-కామేపల్లి భాస్కర్, డైరీఫామ్ నిర్వాహకుడు